మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 115 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## అసెంబ్లీ 27కు వాయిదా

### ఉదయం బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం

హైదరాబాద్,జూలై25(ప్రజామంటలు): బడ్జెట్ సమర్పణ అనంతరం తెలంగాణ అసెంబ్లీ వని వారానికి వాయిదా పడింది. 27కు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం ముగిసిన వెంటనే సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు సభ తిరిగి ప్రారంభం కానుంది. ఉదయం కేబినేట్ సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. అంతకుముందు డిప్యూటి సిఎం భట్టి దంపతులు ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఇక బ్జడెట్ సమావేశాలు ఆగస్టు 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ నెల 26, 28, 29, 30 తేదీల్లో సభకు సెలవు ప్రకటించారు. 27న బ్జడెట్‌పై చర్చ చేపట్టి, అదే రోజు ప్రభుత్వం సమాధానం ఇవ్వనుంది. 31న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ జరపనున్నారు. అదే రోజు పలు బిల్లులను సభ ముందుంచి ఆమోదించనున్నారు. ఆగస్టు 1, 2 తేదీల్లోనూ పలు బిల్లులను సభలో ప్రవేశపెట్టనున్నారు.



# రూ. 2,91,159 కోట్లతో
# తెలంగాణ 2024-25 వార్షిక బడ్జెట్

## అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టి - వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ కేటాయింపులు

- గత ప్రభుత్వ విధ్వంసం నుంచి విజయతీరాలకు
- ఆర్థిక లోటు నుంచి కోలుకునే దిశగా అడుగులు
- ఆర్థిక లోటు అంచనా రూ.49,255.41 కోట్లు
- ప్రాథమిక లోటు అంచనా రూ.31,525.63 కోట్లు
- రెవెన్యూ మిగులు అంచనా రూ.297.42 కోట్లు
- వ్యవసాయానికి రూ.72,659 కోట్లు
- ఉద్యానశాఖకు రూ.737కోట్లు
- పశుసంవర్ధశాఖకు రూ.1,980కోట్లు
- రూ.500 గ్యాస్ సిలిండర్ పథకానికి రూ. 723కోట్లు
- గృహజ్యోతికి రూ.2,418కోట్లు
- ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.3836కోట్లు
- రీజనల్ రింగ్ రోడ్డు కు రూ.1,525 కోట్లు
- స్త్రీ, శిశు సంక్షేమానికి రూ. 2,736 కోట్లు
- ఎస్సీ సంక్షేమం రూ.33,124కోట్లు
- ఎస్టీ సంక్షేమం రూ.17,056కోట్లు
- మైనార్టీ సంక్షేమం రూ.3,003కోట్లు
- బీసీ సంక్షేమం రూ.9,200 కోట్లు
- వైద్య, ఆరోగ్యం రూ. 11,468 కోట్లు
- ట్రాన్స్‌కో, డిస్కంలకు రూ.16,410 కోట్లు
- అడవులు, పర్యావరణం రూ.1,064 కోట్లు
- పరిశ్రమల శాఖకు రూ. 2,762 కోట్లు
- ఐటీ శాఖకు రూ.774 కోట్లు
- నీటిపారుదల రంగానికి రూ.22,301 కోట్లు
- విద్యకు రూ.21,292 కోట్లు
- హోంశాఖకు రూ.9,564కోట్లు
- రోడ్లు, భవనాల శాఖకు రూ.5,790 కోట్లు
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.29,816 కోట్లు

హైదరాబాద్, (ప్రజా మంటలు): అభివృద్ధి, సంక్షేమ రంగాలను పరుగు పెట్టించేలా.. వ్యవసాయాన్ని గాడిలో పెట్టించేలా...అనేక రంగాలను భ్రష్టు పట్టించి, అప్పులు చేసిన తెలంగాణను తలెత్తుకునేలా చేసేలా...కాంగ్రెస్ ప్రభుత్వం తన తొలి వార్షిక బడ్జెట్‌ను గురువారం అసెంబ్లీకి సమర్పించింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అన్ని రంగాల్లో దివాళా తీయించిన క్రమంలో మళ్లీ పట్టాలకు ఎక్కించేలా ప్రభుత్వం పూనుకుందని చెబుతూ ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశ పెట్టారు. మండలిలో మంత్రి శ్రీదర్ బాబు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఎన్నికలు ముగిసి, కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన తరవాత.. కేటాయింపులు ఏవీ లేకపోయిన సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆరుగ్యారెంటీల అమలు, ఇచ్చిన హామీలు పూర్తి చేయడం, అన్నిరంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రకటిస్తూ..డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో పూర్తిస్థాయి పద్దును ప్రవేశపెట్టారు. రూ.2,91,159కోట్లతో బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకొస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీనిలో మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా చెప్పారు. పన్ను ఆదాయం 1,38,181.26 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.35,208.44 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా 26.216.28 కోట్లు, కేంద్రం గ్రాంట్లు 21,636.15 కోట్లుగా పేర్కొన్నారు. ఈ ఏడాది రూ.57,112 కోట్ల అప్పులు తీసుకోవాలని ప్రతిపాదించారు. నిజాం షుగర్స్‌ను తిరిగి



ప్రారంభిస్తామని భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. తెలంగాణ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికే సింహభాగం ప్రకటించారు. రూ.72,659 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇది రైతుల తలరాతలు మార్చే చరిత్రాత్మక నిర్ణయమన్నారు. దేశ చరిత్రలో వ్యవసాయరంగానికి ఇది ఒక మైలురాయి అని తన ప్రసంగంలో పేర్కొన్నారు. రైతు భరోసా సహా ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతామని, బడ్జెట్‌అంటే.. కేవలం అంకెల సమాహారం కాదు. విలువలు, ఆశల వ్యక్తీకరణ కూడా అంటూ ప్రకటించారు. జిల్లాల మధ్య ఆదాయ అంతరాలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. అసమానతలు లేని సమసమాజ స్థాపన దిశగా అడుగులు వేస్తున్నాం. ఈ ఏడాదిలోనే రైతు కూలీలకు రూ.12వేలు అందించే బృహత్తర కార్యక్రమం చేపడతాం అని అన్నారు. పీఎం ఫసల్ బీమా యోజనలో చేరాలని నిర్ణయించాం. రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. పైసా ఖర్చు లేకుండా పంటలకు పూర్తి భద్రత కల్పిస్తాం. వరి రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించాం. ఆయిల్‌పామ్ రైతులకు అవసరమైన సాయం అందిస్తాం. 2024-25 సంవత్సరానికి రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో ఆ పంట సాగు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 77,857 ఎకరాలకు రిజిస్ట్రేషన్ జరగ్గా.. 23,131 ఎకరాలకు అనుమతులిచ్చాం' అని భట్టి విక్రమార్క చెప్పారు.

## పొలిట్రిక్స్

రాష్ట్రంలో రాజుకున్న
'పొలిటికల్' హీట్ ,
పవర్ఫుల్ పంచులతో
రగులుతున్న 'ఫైట్' !

సవాళ్ల ప్రతిసవాళ్ల
చీకటిలో బాణాలు ,
పనిచేసే ప్రభుత్వాన్ని
ఇరుకున పెట్టే వైనాలు !

- న్యాలకంటి నారాయణ
9346200066

## విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతాం

8లో..



## కేజ్రీవాల్, కవిత కస్టడీ పొడిగింపు

## కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్దుష్ట విధానం లేదు

- బడ్జెట్‌లో అన్నిరంగాలను విస్మరించారు
- వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ పాలసీలపై అస్పష్టత
- మీడియా పాయింట్ వద్ద కెసిఆర్ విమర్శలు
- ఓటమి తరవాత తొలిసారి అసెంబ్లీకి హాజరు

హైదరాబాద్, (ప్రజామంటలు): తెలంగాణ బడ్జెట్‌లో వ్యవసాయ, పారి శ్రామిక, ఐటీ పాలసీ లపై నిర్దిష్టమైన విధానం లేదని భారాస అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ విమర్శించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన తొలిసారి అసెంబ్లీకి హాజ రయ్యారు. కెసిఆర్ ఎప్పుడు వస్తారా అని ఎదురు చూస్తున్న వారి ఉత్కంఠకు తెరదిం చుతూ సమావేశాలకు వచ్చారు. బడ్జెట్ ప్రసంగం తరవాత అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. భారాస హయాంలో మేం రెండు పంటలకు మిగతా 2లో..



## జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద

### 42 గేట్లు ఎత్తి నీటి విడుదల


మహబూబ్‌నగర్,జూలై25 (ప్రజామంటలు): గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద పోటెత్తింది. మిగతా 2లో..

## మహారాష్ట్రకు భారీ వర్ష హెచ్చరిక

### ఐఎండి హెచ్చరికలతో పుణెలో పాఠశాలల మూసివేత

3లో..

## ప్రజా నాడి




## ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ కాళేశ్వరం

- చిన్న ఘటనను భూతద్దంలో చూపి చిన్నచూపు
- పంపింగ్ చేసి వెంటనే ప్రాజెక్టులను నింపాలి
- కాళేశ్వరం చేరుకున్న బిఆర్ఎస్ బృందం
- ప్రభుత్వ తీరును ఎండగడతామన్న కెటిఆర్

కరీంనగర్,జూలై25 (ప్రజామంటలు): ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మేడిగడ్డలో జరిగిన చిన్న సంఘటనను భూతద్దంలో కాంగ్రెస్ నేతలు చూపుతున్నారని విమర్శించారు. కాళేశ్వరాన్ని విఫల ప్రాజెక్టు అని అబద్దపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ఉన్నా డ్యాంల పరిశీలన చేస్తున్నామని వివరించారు.రైతులు ఆందోళన చెందితే ఇంకా ఎందుకు పంపింగ్ చేయడం లేదని రేవంత్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కన్నెపల్లి వద్ద పంపులు ఆన్ చేస్తే అన్ని ప్రాజెక్టులు నీటితో నింపవచ్చని అన్నారు. మేడిగడ్డ కొట్టుకు పోతుందని చేసిన ప్రచారం వట్టిదేనని తేల్చిచెప్పారు. శాసనసభ సమావేశంలోనే రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని అన్నారు. రేపు కన్నెపల్లి, మేడిగడ్డ బారేజిని సందర్శిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శించేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత వారు బయలుదేరారు. అసెంబ్లీ నుంచి భారీ ర్యాలీగా ప్రత్యేక బస్సుల్లో



ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లారు. కాళేశ్వరం చేరుకుని మొదటగా రిజర్వాయర్ సందర్శించారు. శుక్రవారం 10 గంటలకు కన్నెపల్లి పంపు హౌజ్, 11గంటలకు మేడిగడ్డ బ్యారేజీలను వారు సందర్శిస్తారు. అనంతరం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

# కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్దుష్ట విధానం లేదు

రైతుబంధు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని ఎగ్గొడతామని చెబుతోంది. మేం రైతులకిచ్చిన డబ్బును దుర్వినియోగం చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఇది పూర్తిగా రైతు శత్రు ప్రభుత్వమని తెలుస్తోంది. ధాన్యం కొనుగోలు చేయలేదు. విద్యుత్, నీటి సరఫరా, గొర్రెల పంపిణీ లేదు. రైతు భరోసా గురించి ప్రస్తావనే లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, వృత్తి కార్మికులను వంచించింది. రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఇది పేదల, రైతు బడ్జెట్ కాదని అన్నారు. ప్రభుత్వానికి ఒక విదానమంటూ లేదన్నారు. కథ చెప్పారు తప్ప.. బడ్జెట్ పెట్టినట్టు అనిపించలేదన్నారు. రైతు భరోసాలో అనేక ఆంక్షలు పెడుతున్నట్టు చెప్పారు. ప్రజల గొంతు కోసింది ఈ ప్రభుత్వం. దళితబంధు పథకం ప్రస్తావనే లేదు. దళితులంటే ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఇదేనా? గొర్రెల పెంపకం పథకానికి తూట్లు పొడిచారు. ఒత్తి పలకడం తప్ప భట్టి కొత్తగా చెప్పిందేమీ లేదు. రైతులను పొగిడినట్టే పొగిడి నిండా ముంచారు. బడ్జెట్ ఒట్టి డొల్ల. అన్ని వర్గాలను మోసం చేసింది. కథ చెప్పారు తప్ప.. బడ్జెట్ పెట్టినట్టు అనిపించలేదు. పేదల కోసం ఒక్క పాలసీ అయినా ప్రకటించారా? బడ్జెట్‌లో ఒక పద్దు.. పద్ధతి లేదు. బడ్జెట్‌పై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతాం అన్నారు. యాదవులు, మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఇచ్చాం. ఈ ప్రభుత్వానికి పాలసీ లేదని అర్థమైంది. ఐటీ, పారిశ్రామిక పాలసీ ఏది? ఏ ఒక్క కొత్త సంక్షేమ పథకం ప్రకటించలేదు' అని కేసీఆర్ విమర్శించారు. ఈ బడ్జెట్‌ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. . రైతులను పొగిడినట్లే పొగిడి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. తాము ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. మత్స్యకారులకు భరోసా లేదని గొర్రెల పంపిణీ పథకాన్ని పూర్తిగా మూసివేసినట్లు కనిపిస్తోందని అన్నారు. దళిత బంధు ప్రస్తావన లేదని తెలిపారు. ఒక్క కొత్త పథకం ప్రవేశపెట్టలేదని విమర్శించారు. రాష్ట్రంలో వ్యవసాయ, పరిశ్రమల సంగతి ఏంటని ప్రశ్నించారు. రైతులను వృత్తికార్మికులను ప్రభుత్వం వంచించిందని మాజీ సీఎం కేసీఆర్ విమర్శించారు. ఆయారంగాల అభివృద్ధికి ఏం చర్యలు తీసుకుంటు న్నారో విధివిధానాలు లేవన్నారు. ఉన్న పథకాలను మూసివేస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. ఓడిన తర్వాత.. ప్రతిపక్ష నేత హోదాలో బ్జడెట్ సమావేశానికి హాజరైన కేసీఆర్.. మీడియా కేవలం రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడి.. తాను చెప్పాలనుకున్నది చెప్పి వెళ్లిపోయారు.



## ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ కాళేశ్వరం

ఈ పర్యటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు కాళేశ్వరంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని గులాబీ నేతలు మండి పడుతున్నారు. ప్రాజెక్టు పగుళ్లు, ఇసుకలో కూరుకుపోతోందంటూ చేసే ప్రచారాలు మానుకోవాలని హితవు పలుకుతున్నారు. ప్రతినీటి బొట్టును ఒడిసిపెట్టాలన్న సంకల్పంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీ లెవల్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం అని చెప్పారు. కన్నెపల్లి పంప్‌హౌస్, మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలించేందుకు బయల్దేరిన బీఆర్ఎస్ నేతల బృందం కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్‌ను పరిశీలించింది. కాళేశ్వరం ప్రాజెక్టు సాయంతో పంజాబ్‌ను తలదన్నేలా తెలంగాణ ధాన్యం పండించిందని కేటీఆర్ గుర్తుచేశారు. చిన్న పొరపాటును పట్టుకుని నానాయాగీ చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టును వృథా ప్రయత్నంగా చూపించే కుట్ర జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది 45 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని అధికారులు చెబుతున్నారని అన్నారు. కాబట్టి నీళ్లు వృథా పోకుండా వెంటనే రిజర్వాయర్లను నింపాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో కన్నెపల్లి పంప్‌హౌస్ దగ్గర 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు కిందకు వృథాగా పోతుందని ఇంజనీర్లు చెబుతున్నారని కేటీఆర్ అన్నారు. పంపింగ్ చేసే అవకాశం ఉన్నా కూడా ప్రభుత్వం చేయడం లేదని.. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు ఎనిమిది నెలలుగా ప్రయత్నం జరుగుతుందని మండిపడ్డారు. రాజకీయ కక్షలు పెట్టుకుని రైతులను ఆగం చేయవద్దని సూచించారు. కాళేశ్వరం రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లను సందర్శిస్తున్నామని కేటీఆర్ అన్నారు. ఎండిపోతున్న పొలాలు, మండుతున్న రైతుల గుండెలను చూడ్డానికే వచ్చామని తెలిపారు. దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం రిజర్వాయర్‌లో 240 టీఎంసీల నీళ్లను నింపుకోవచ్చని తెలిపారు. అంటే 24 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వొచ్చని పేర్కొన్నారు.

# మహారాష్ట్రకు భారీ వర్ష హెచ్చరిక

### ఐఎండి హెచ్చరికలతో పుణెలో పాఠశాలల మూసివేత

ముంబయి,జూలై25 (ప్రజా మంటలు): మహారాష్ట్రను వర్షాలు ముంచెత్తుతున్నాయి. గురువారం భారీ వర్షాలు కురిసే అవకాశం వుండటంతో భారత వాతావరణ శాఖ మహారాష్ట్రకు, పూణెలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఐఎండి హెచ్చరికల మేరకు పూణెలోని పింపి, చింఛ్వాడ్, భోర్, వెల్హా, మావల్, ముల్షీ, హవేలా, ఖడక్వాస్లా ప్రాంతాల్లోని పాఠశాలలను మూసివేయాలని జిల్లా మెజిస్ట్రేట్ సుహాస్ దివాస్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, తప్పనిసరి అయితేనే బయటకు వెళ్లాలని ఆయన ప్రజలకు సూచించారు. గురు, శుక్రవారాల్లో ముంబై నగరంలోని శివారు ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని బృహన్ ముంబై మెట్రోపాలిటన్ కౌన్సిల్ (బిఎంసి) తెలపింది. ఇక జులై 24 ఉదయం 8 గంటల నుండి 25వ తేదీ ఉదయం 8 గంటలకు వరకు 44 మి.మీ వర్షపాతం నమోదైంది. తూర్పు శివారు ప్రాంతాల్లో 90 మి.మీ, పశ్చిమ శివారు ప్రాంతాల్లో 88 మి.మీ వర్షపాతం నమోదైందని బిఎంసి తెలిపింది. ఃూగా, పూణెలో బుధవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా ఏక్తా నగరి, విఠల్ నగర్ ప్రాంతాల్లోని ఇళ్లు, భవనాల్లోకి నీరు చేరింది. దీంతో పూణె అగ్నిమాపక సిబ్బంది పడవల సహాయంతో ఇళ్లలోని ప్రజలను తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. గురువారం ఉదయం 6 గంటల సమయంలో 40 క్యూసెక్కుల నీటిని ముఠా నదిలోకి పూనె అధికార యంత్రాంగం విడుదల చేసింది. ఈరోజు ఉదయం నాలుగు గంటలకు 27203 క్యూసెక్కుల వేగంతో నీటిని విడుదల చేశారు. కుండపోత వర్షాలు కురుస్తున్న కారణంగా ఈ నది ఒడ్డున నివసించే వారు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పాల్ఘర్, రత్నగిరి, సింధుదుర్గ్ మీదుగా గంటకు 50 నుండి 60 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని జిల్లా సమాచార కార్యాలయం అంచనా వేసింది. అలాగే కొల్హాపూర్, పూణెలోని ఘాట్ ప్రాంతల్లోకూడా గాలులు వీచే అవకాశం ఉంది. వర్షాల కారణంగా ముంబైలోని అంధేరి సబ్‌వేపై రాకపోకలను అధికారులు మూసివేశారు. ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం మొత్తానికి నీటిని సరఫరా చేసే 7 సరస్సుల్లో ఒకటైన విహార్ సరస్సు ఈరోజు తెల్లవారుజామున 3.50 గంటలకు పొంగిపొర్లింది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టులో విచారణ


### మహేశ్వర్ రెడ్డి ఫిర్యాదును స్పీకర్ స్వీకరించాలని ఆదేశం

హైదరాబాద్,జూలై25 (ప్రజా మంటలు): ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపు అంశంపై తెలంగాణ హైకోర్టులో గురువారం మరోసారి విచారణ జరిగింది. భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై చర్యలు తీసుకో వాలంటూ చేసిన ఫిర్యాదును స్పీకర్ తీసుకోలేదని భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ తన ఫిర్యాదును స్వీకరించేలా ఆదేశించాలని కోర్టును కోరారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌ను తీసుకోవాలని, పిటిషనర్‌కు ధ్రువీకరణ రశీదు ఇవ్వాలని స్పీకర్ కార్యాలయాన్ని హైకోర్టు ఆదేశించింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిలపై దాఖలు చేసిన పిటిషన్‌లపైనా విచారణ జరిగింది. స్పీకర్ నిర్ణయం తీసుకోక ముందే పిటిషనర్లు కోర్టుకు వచ్చారని ఏజీ తెలిపారు. స్పీకర్ ఇండిపెండెంట్ ట్రైబ్యునల్ అని.. కోర్టుల జోక్యం ఉండదన్నారు. గతంలో సుప్రీంకోర్టు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసిందని ఏజీ తెలిపారు. 3 నెలలైనా స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న వాదన సరైంది కాదన్నారు. వివాదం కోర్టులో ఉన్నందున స్పీకర్.. పిటిషన్లను పరిశీలించలేదని ఏజీ వివరించారు. స్పీకర్ కోర్టు నిర్ణయం కోసం వేచి చూస్తూ ఉండొచ్చన్నారు. తదుపరి విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది.

### భూమిలేని కూలీలకు ఏటా 12 వేల సాయం

హైదరాబాద్,జూలై25 (ప్రజా మంటలు): రాష్ట్రంలో భూమిలేని గ్రామీణ ప్రజానీకం ఎక్కువగా రైతు కూలీ లుగా జీవనం గడుపుతోందని, వారికి ఎలాంటి ఆర్థిక భద్రత లేకపోవడంతో పనిదొరకని రోజుల్లో పస్తులు ఉండాల్సి వస్తున్నదని ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అసెంబ్లీలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెడుతూ ఆర్థిక మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. గ్రా మీణ ప్రాంతాల్లో చాలా మందికి సొంత భూములు లేవని, దాంతో వాళు రైతు కూలీలుగా జీవనం గడుపుతున్నారని ఆర్థిక మంత్రి చెప్పారు. వారి జీవితాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. అందుకే భూమిలేని రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సాయాన్ని ఈ సంవత్సరమే ప్రారంభిస్తామని చెప్పారు.

# జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద



దీంతో అధికారులు ప్రాజెక్టు 42 గేట్లు ఎత్తివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 2.06 లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. జలాశయం నుంచి 1.97 లక్షల క్యూక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇందులో స్పిల్‌వే ద్వారా 1.69 లక్షల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 24,201 క్యూసెక్కులు, నెట్టెంపాడు లిఫ్ట్‌కు 1500 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్‌కు 1300 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.జూరాల పూర్తిస్థాయి నీటిట్టం 318.51 మీటర్లు కాగా ఇప్పుడు 316.71 మీటర్ల వద్ద నీరు ఉన్నది. అదేవిధంగా ప్రాజెక్టులో 9.65 టీఎంసీల నీటి నిల్వకుగాను ప్రస్తుతం 6.23 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఇక ఎగువన మహారాష్ట్రలో ఉన్న ఆల్మట్టి నుంచి 2.25 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తున్నది. ఉదయం 10.30 గంటల వరకు అది 2.50 లక్షలకు చేరవచ్చని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దిగువ ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా కర్ణాటకలోని నారాయణ పూర్ రిజర్వాయర్ నుంచి 2.24 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తున్నది. ప్రస్తుతం ప్రాజెక్టులో 26.623 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 33.313 టీఎంసీలు.

## విద్యారంగానికి అరకొర నిధులు

### యూనివర్సిటీల అభివృద్ధి ఊసేది

### బడ్జెట్ తీరుకు నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు

హైదరాబాద్,జూలై25 (ప్రజా మంటలు): తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బ్జడెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. విద్యారంగానికి కేవలం 7.3శాతం... ఇది గత ఓటాన్ బడ్జెట్లో కేటాయించిన దాని కంటే తక్కువని అభిప్రాయపడింది. ఈ కేటాయింపులు నిరసనగా రేపు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు పిలుపు నిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్ష్యా, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి. నాగరాజు తెలిపారు.గత బడ్జెట్లో విద్యారంగానికి 21,389 కోట్ల రూపాయలు కేటాయించింది. అది ప్రస్తుతం 21,292కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ప్రస్తుతం ప్రభుత్వ విద్యయే మాత్రం అభివృద్ధి కాదని ఎస్ఎఫ్ భావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టినట్లు ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పింది.కానీ దాని ఊసు ఈ బడ్జెట్లో లేదు. ప్రతి రెండు గ్రామాలకు ఒక గురుకులం అని అన్నారు. దాని గురించి చర్చే లేదు. యూనివర్సిటీల అభివృద్ధి రాష్ట్రంలో 500 కోట్లతో ఎలా సాధ్యం అవుతుంది. వీటిలో ఉస్మానియా, మహిళా యూనివర్సిటీ 200 కోట్లు పోనూ 300 కోట్లు పలహారం పంచినట్లు పంచారు. యూనివర్సిటీల నిర్వహణ మినహా అభివృద్ధికి యూనివర్సిటీలు నోచుకోవు. ప్రజా ప్రభుత్వం ఎలా ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తుందో తెలపాలని ఎస్ఎఫ్ఐ ప్రశ్నిస్తోంది. రాష్ట్రంలో గత బిఆర్ఎస్ పాలనలో యూనివర్సిటీలు దెబ్బతిన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెస్,భవనాలు, ఖాళీల భర్తీ, మౌళిక సదుపాయాలు కల్పిస్తామని ప్రతి యూనివర్సిటీకి అభివఅద్ధికి నిధులు ఇస్తామని చెప్పారు. ఉస్మానియా కు 1000కోట్లు,మహిళ యూనివర్సిటీఅభివృద్ధి కోసం. 500 కోట్లు నిధులు నిర్వహణ, బాసర ఐఐఐటి అభివృద్ధి, అలాగే ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలలో నూతన యూనివర్సిటీలు కోసం కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ యూనివర్సిటీలు అభివృద్ధి కోసం 500కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుంది. రాష్ట్రంలో ఉన్న 11 రాష్ట్ర యూనివర్సిటీలకు కనీసం నిర్వహణకు కూడా నిధులురావు. ఒక్క ఉస్మానియా యూనిర్సిటీకే 350 కోట్లు పైగా నిర్వహణకు అవసరం. కాకతీయ, మహాత్మాగాంధీ, తెలంగాణ, శాతవాహన, జెఎన్టీయుహెచ్, ్ర÷న్ ఆర్ట్స్, మహిళా యూనివర్సిటీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ,వెటర్నరీ, హార్టీకల్చర్ లాంటి వాటికి నిధులు కేటాయింపులు లేవు. తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ప్రకారం బాసర ఐఐఐటిల లాగా మరో రెండు కేటాయిస్తామని చెప్పి వాటి గురించి కూడా ప్రస్థావన లేదు. పాఠశాల విద్యారంగంలో ఖాళీలు భర్తీ , మధ్యాహ్న భోజనం నిధులు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, నూతన భవనాలు, లైబ్రరీ, ముత్రశాలలు, మౌళిక సదుపాయాలు కోసం ఈ నిధులు సరిపోవని ఎస్ఎఫ్ ఐ భావిస్తోంది. గురుకులాలు నిర్మాణం కోసం కూడా కనీస నిధులు లేవు ఇప్పటికే రాష్ట్రంలో 800 పైగా గురుకులాలకు స్వంత భవనాలు లేవని, ఉన్న గురుకులాలు కూడా సరైన మౌళిక సదుపాయాలు లేవు. ఈ బడ్జెట్లో గత ఆరేళ్ళ నుండి పెండింగ్ ఉన్న స్కాలర్ షిప్స్ , ఫీజు రీయంబర్స్ మెంట్స్ 7 వేల కోట్ల పైగా పెండింగ్ లో ఉన్నాయి.

# బడ్జెట్‌లోఆరు గ్యారెంటీలకు పెద్దపీట

### ఉచితబస్సు, గ్యాస్, విద్యుత్ పథకాలకు నిధులు

### మహాలక్ష్మి పథకంతో రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు

### ఆర్టీసి ఉచిత బస్సుకు రూ.200 కోట్లు

### గ్యాస్ సిలిండర్ల కోసం రూ.723 కోట్లు

హైదరాబాద్,జూలై25 (ప్రజా మంటలు): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడంలో కీలక భూమిక పోషించిన ఆరు గ్యారంటీలకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను ప్రారంభించిన సర్కారు.. తాజా బడ్జెట్‌లో వాటికి నిధులు కేటాయించింది. ఆరు గ్యారంటీల్లో మరికొన్ని పథకాలనూ ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర నుంచి ఊరట కల్పించేందుకు మహాలక్ష్మి పథకం కింద రూ.500కే వంటగ్యాస్ సిలిండర్‌ను తమ ప్రభుత్వం ప్రారంభించిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకం వల్ల ఇప్పటి వరకు 39,57,637 కుటుంబాలకు లబ్ది చేకూరిందని, ఇందుకు రూ.200 కోట్లను ప్రభుత్వం వెచ్చిందన్నారు. ఈ బడ్జెట్‌లో గ్యాస్ సిలిండర్ల కోసం రూ.723 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు.మహిళను మహాలక్ష్మిగా గౌరవించడం మన సంస్కృతి అని, మహాలక్ష్మి పథకం కింద తెలంగాణ రాష్ట్రంలోని మహిళలందరికీ టీజీఆర్‌టీసీ నడిపే బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రయాణించే దూరంపైన, ప్రయాణించే పర్యాయాలపైన ఎటువంటి పరిమితీ విధించలేదని చెప్పారు. ఇప్పటి వరకు 68.60 కోట్ల ప్రయాణాలను మహిళలు చేశారని, పర్యవసానంగా మహిళలకు రూ.2,351 కోట్లు ఆదా అయ్యిందన్నారు. ఉచిత బస్సు సౌకర్యం పరోక్షంగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోందని పేర్కొన్నారు. ఈ పథకానికి అయ్యే ఖర్చు ఆర్టీసీకి ప్రభుత్వం నెలవారీగా చెల్లిస్తోందని, దీనివల్ల ఆర్టీసీ సంస్థ కూడా ఆర్థికంగా బలోపేతమై బిలియన్ డాలర్ కార్పొరేషన్‌గా అవతరించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది మార్చి 1 నుంచి గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తన బ్జడెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్‌ని వినియోగించుకొనే గృహాలకు ఉచిత విద్యుత్ అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజాపాలన-ప్రజా సేవ కేంద్రాల ద్వారా వచ్చిన ధరఖాస్తులను స్వీకరించి అర్హులైన వారందరికి ఈ ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద అర్హులైన లబ్దిదారులకు డిస్కంలు సున్నా బిల్లులు జారీ చేస్తున్నాయని, ప్రభుత్వం ఆ బిల్లుల మొత్తం ఛార్జీలను డిస్కంలకు చెల్లిస్తుందని చెప్పారు. జులై 15 నాటికి 45,81,676 ఇళ్లల్లో వెలుగుల జిలుగులు నింపగా.. జూన్ వరకు అందించిన విద్యుత్తుకుగానూ డిస్కంలకు ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.583.05 కోట్లు చెల్లించిందని అన్నారు. ఈ బ్జడెట్‌లో ఉచిత విద్యుత్‌కు రూ.2,418 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ ప్రధాన కర్తవ్యమని భట్టి విక్రమార్క అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా



తమ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇళ్లు' నూతన గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈ పథకం కింద పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించామన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు రూ.6 లక్షలు చెల్లిస్తామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గంలో కనీసం 3,500 ఇళ్ల చొప్పున మొత్తం 4,50,000 ఇళ్ల నిర్మాణానికి సహకారం అందించాలని నిర్ణయించామని తెలిపారు. రెండు పడక గదుల ఇళ్ల పథకం కింద పూర్తయిన ఇళ్లను త్వరలోనే కేటాయిస్తామన్నారు. పూర్తికాని వాటిని సత్వరమే పూర్తి చేసి మౌలిక వసతులను కల్పించి అర్హులకు అందజేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో చెల్లింపులు జరిగేవి కాదని, తమ ప్రభుత్వం 48 గంటల్లోనే చెల్లింపులు చేస్తోందని భట్టి విక్రమార్క అన్నారు. ఇప్పటి వరకు రూ.10,556 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లోకి జమ చేశామన్నారు.

అర్హులైన రైతులకు మాత్రమే లబ్ది చేకూరేలా రైతుబంధు పథకం స్థానే రైతు భరోసాను తమ ప్రభుత్వం తీసుకొచ్చిందని భట్టి విక్రమార్క అన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన రైతులకు ఏటా ఎకరానికి రూ.15,000 చెల్లించాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. దీని అమలుకు విధివిధానాలు చర్చించి నిర్ణయించడానికి ఒక క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ఇప్పటికే పలువురి అభిప్రాయాలను సేకరించిందని, వాటిని సభలో సభ్యులందరి అభిప్రాయాన్ని తీసుకొని అమలు చేయాల్సిన విధి విధానాలపై తగిన నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. తెలంగాణలో వరి సాగు చాలా విస్తృతంగా జరుగుతుందని, పండిన పంటకు సరైన ధర రాక పెట్టుబడి కూడా దక్కక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో సన్న రకం వరి ధాన్యాల సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం 33 రకాల వరి ధాన్యాలను గుర్తించి, వాటిని పండించిన రైతుకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని నిర్ణయించిందన్నారు. దీనివల్ల సన్నరకాల వరిని పండించే సాగు భూమి విస్తీర్ణం పెరిగి, రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు.

# అర్థరాత్రి రోడ్డు ప్రమాదం

### లారీని ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి

పెద్దపల్లి,జూలై25 (ప్రజా మంటలు): పెద్దపల్లి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులకు బుధవారం రాత్రి 11గం ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలలోకి వెళ్తే.. వివరాల్లోకి వెళ్తే.. ఈశాల తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు దాడి శివ, కొండ వికాస్, పొన్నం సాయి కిరణ్ గోదావరిఖని నుంచి ఈశాల తక్కళ్లపల్లి గ్రామానికి వారి బైక్ పైన వస్తున్నారు. ఈ క్రమంలో ఐ.ఓ.సి పెట్రోల్ పంపు యూ టర్న్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొట్టడంతో దాడి శివ(18) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే 108లో గోదావరిఖని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిసున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టార. శివ మృతి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# వర్షాలతో సీజనల్ వ్యాధుల భయం

### జిల్లాల్లో మలేరియా,డెంగ్యూల ప్రభావం

### అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ హెచ్చరిక

కాకినాడ,జూలై25 (ప్రజా మంటలు): యేటా వానా కాలంలో వ్యాధుల ముప్పు పెరిగి పేదల జీవితాలు దుర్భరమవుతున్నాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గు న్యా, మెదడువాపు, ఫైలేలేరియా, అతిసారం, టైఫాయిడ్, తదితర సీజనల్ వ్యాధులు గ్రామీణులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ ఏటా హెచ్చరిస్తూనే ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు, నియంత్రణ చర్యలను కూడా ఏకకాలంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్యశాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటిసంబదిత, కీటక సంబందిత వ్యాధులు ప్రబలుతున్నందున్న జాగ్రత్తగా ఉండాలనిఆయా శాఖలను ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న సామాజిక, బౌగోళిక వైరుధ్యాల కారణంగా యేటా వానాకాలంలో అంటు వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు కూడా ప్రబలడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. మలేరియా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో..ఈ నేపథ్యంలోనియంత్రణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాదితులు మరణించినట్లు అధికారికంగా రికార్డు కాకపోయినా ఏజెన్సీలో ఎలాంటి డయాగ్నసిస్ చేయని కేసులే అధికంగా ఉన్నాయంటున్నారు. కాగా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించామని చెబుతున్నా మారుమూల గ్రామాల్లో రహదారులు సరిగ్గా లేని కారణంగా సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి శాంపిల్స్‌ను సేకరించే పరిస్థితులు అంతంత మాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో చాలా మంది జ్వరాల బారిన పడిన రోగులు అందుబాటులో ఉండే ఆర్ఎంపీలు, సాంప్రదాయ నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తూ ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీలో మలేరియా వంటి వ్యాధుల నియంత్రణ కోసం ఆదివాసీ గ్రామాల్లో వేల దోమ తెరలను పంపిణీ చేశారు. మారుమూల అటవీ గ్రామాల్లో ప్రతి సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలకు సిబ్బంది కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడి చేరుకోవడం వైద్య సిబ్బందికి కత్తిమీద సాములా మారింది.



# విశాఖ పాలిటెక్నిక్‌లో మరుగుదొడ్ల సమస్య

### చర్యలు తీసుకోవాలన్న బిజెపి ఎమ్మెల్యే

### సమస్యలు లేకుండా చూస్తామన్న మంత్రి లోకేశ్

అమరావతి,జూలై25(ఆర్ఎన్ఎ): ఏపీ అసెంబ్లీ సమావేశాలు గురువారం ఉదయం ప్రారంభమయ్యాయి. సభ మొదలవగానే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభించారు. విశాఖపట్నం పాలిటెక్నిక్ కాలేజీలో మరుగుదొడ్లపై బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు మాట్లాడారు. విశాఖపట్నం పాలిటెక్నిక్ కాలేజీలో సరిపడా మరుగుదొడ్లు ఉన్నాయా అంటే మంత్రి ఉన్నాయని అంటున్నారని.. అయితే పరిస్థితులు వేరుగా ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వాన్ని తాను దుర్మార్గపు ప్రభుత్వం అన్నందుకు జైలులో పెట్టారని, ఇప్పుడు బెయిల్‌పై ఉన్నట్లు చెప్పారు. తన నియోజకవర్గంలో ఉన్న పాలిటెక్నిక్ కాలేజీ, ఎమ్మార్వో ఆఫీసు, రైతు బజార్ , ఆర్ అండ్ బీ క్వార్టర్స్‌ను తాకట్టు పెట్టేశారని విష్ణుకుమార్ రాజు తెలిపారు. విశాఖ పాలిటెక్నిక్ కాలేజ్ చాలా ప్రఖ్యాతి గాంచిన కాలేజ్ అని... ఇందులో అన్ని కోర్సులు ఉన్నాయన్నారు. 23 ఎకరాల 38 సెంట్ల విస్తీర్ణంలో కాలేజీ ఉందన్నారు. ఈ మధ్యకాలంలో పిల్లలు మంచినీళ్లు కూడా తాగకుండా కాలేజీలకు, స్కూళ్లకు వెళ్లే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. సరైన టాయిలెట్స్ లేకపోవడమే ప్రధాన కారణమన్నారు. కాలేజీ యాజమాన్యాలు భయపడి అసలు విషయాలను దాచేస్తున్నారని... ఉన్న వాస్తవాలు కూడా చెప్పకపోతే ప్రభుత్వం కూడా ఏమీ చేయలేదని అన్నారు. పాలిటెక్నిక్ కాలేజ్‌లో 1169 మంది అబ్బాయిలు చదుకుంటుండగా వారికి 59 టాయిలెట్స్ అవసరం ఉండగా కేవలం 14 మాత్రమే ఉన్నాయన్నారు. అలాగే 538 మంది అమ్మాయిలు చదువుకుంటున్నారని వారికి 27టాయిలెట్స్ అవసరం ఉండగా కేవలం14 టాయిలెట్స్ ఉన్నాయని తెలిపారు. కేవలం పాలిటెక్నిక్ కాలేజీలోనే కాదు... ప్రైవేటు స్కూళ్లలో కూడా ఇదే పరిస్థితి ఉందని.. దీనిపై మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి సారించాలని విష్ణుకుమార్ రాజు కోరారు. దీనిపై మంత్రి నారా లోకేష్ సమాధానం ఇస్తూ.. విశాఖలోని పాలిటెక్నిక్ కాలేజీలో టాయిలెట్స్ సమస్య ఉందని.. త్వరలోనే ఈ సమస్య లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా వ్యవస్థలు భ్రష్టుపట్టాయని.. వాటిని క్రమంగా సెట్ చేసుకుంటూ వస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. దారి తప్పిన వాటిని సరైన దారిలో పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఒక నెలరోజులు అధికారులకు టైం ఇచ్చామని.. ఈలోగా దారితప్పిన వ్యవస్థను గాడిలో పట్టాలని చెప్పినట్లు తెలిపారు. తప్పకుండా యూనివర్సిటీల దగ్గర నుంచి కేజీల వరకు విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

# నేరాలను నియంత్రించేందుకు, పరిశోధనలోనూ సాంకేతిక పరిజానాన్ని ఉపయోగించాలి

### చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అక్రమ వ్యాపారాలు పై నిఘా ఉంచాలి

### హాఫ్ ఇయర్లీ క్రైమ్ మీటింగ్ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్



జగిత్యాల జూలై 25 (ప్రజామంటలు): జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయం లో ఈ సంవత్సరం గడిచిన 6 నెలలో అన్ని పోలీస్ స్టేషన్లు మరియు ఇతర కార్యాలయాల పనితీరుపై, నమోదైన కేసుల పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... గడిచిన ఆరు నెలల్లో పోలీస్ స్టేషన్ యొక్క పనితీరును, కేసుల చెదనలో సాధించిన పురోగతిని అంచనా వేసుకుంటూ రానున్న ఆరు నెలల్లో మరింత దృఢ నిశ్చయతో పనిచేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. డిఎస్పి లు, సి. ఐ లు తమ పరిధిలో ఉండే పోలీస్ స్టేషన్ లలో నమోదైన వివిధ రకాల కేసులు యొక్క స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత ఎస్.ఐలకు కేసుల దర్యాప్తు కు సంభందించి సూచనలు ఇవ్వాలని సూచించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే దిశగా కృషి చేసి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల భద్రత లక్ష్యంగా పనిచేసే చేయాలని మహిళలు చిన్నపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన , ఎలాంటి దాడులకు పాల్పడిన వారిపై చట్టపరం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలుపరచడానికి అధికారులు అందరూ కృషి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో కలిసి ప్రమాదాలు ఎక్కువగా జరుగు ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు సూచి బోర్డ్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాల దృష్ట్యా ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ప్రణాళికా బద్దంగా పని చేయాలని అన్నారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్య పర్చాలని సూచించారు. జిల్లాల, రాష్ట్ర సరిహద్దుల నుండి వచ్చే గంజాయి సరఫరా చేసే మూలాలను, కీలక వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి అక్రమ రవాణా పకడ్బందీగా నియంత్రించాలన్నారు. అక్రమ కార్యకలాపాలు అయిన గుట్కా, ఇసుక అక్రమ రవాణా, పేకాట,గుడుంబా, %అణూ% రైస్, వాటి పై నిఘా ఉంచి దాడులు నిర్వహించి అరెస్ట్ చేయాలని సూచించారు. నేర స్వభావం కలిగిన వ్యక్తులను పోలీస్ స్టేషన్ ల వారిగా గుర్తించి బైండోవర్ చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీలు వినోద్ కుమార్, భీమ్ రావు, డిఎస్పి లు రవీంద్ర కుమార్, రఘు చంధర్, ఉమా మహేశ్వర రావు, రంగా రెడ్డి మరియు డి.సి.ఆర్.బి., ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మరియు సి.ఐ లు వేణుగోపాల్,రామ్ నరసింహారెడ్డి, రవి, సురేష్, నిరంజన్ రెడ్డి, మరియు ఎస్.ఐ లు, డి.సి.ఆర్.బి., ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.




# కేంద్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

### విజయనగరంలో సిపిఎం రాస్తారోకో

విజయనగరం,జూలై25(ప్రజా మంటలు): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎటువంటి కేటా యింపులు చేయకుండా తీవ్ర అన్యాయం చేసిందని రాష్ట్ర ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద బ్జడెట్ కేటాయింపులను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, తెలుగు ఆడపడుచు అయిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలసీతారామన్ రాష్ట్రానికి కేటాయింపులు చేయకుండా అన్యాయం చేశారన్నారు. విభజన చట్టంలోని అంశాలను నెరవేరుస్తామని చెప్పడం తప్ప ఎటువంటి కేటాయింపులు చేయలేదన్నారు. పోలవరానికి నిధులు లేవు, ఉత్తరాంధ్ర సుజలస్రవంతికి నిధులు కేటాయింపు లేదు, రైల్వే జోన్ ప్రస్తావన లేదు, జిల్లాలో గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయింపు లేదు, అమరావతి నిర్మాణానికి ప్రకటించిన 15 వెల కోట్లు ప్రపంచ బ్యాంక్ అప్పుకింద చెప్పడం దుర్మార్గమన్నారు. ఎటువంటి నిధులు కేటాయించకుండా కేంద్రం బ్జడెట్ పెడితే రాష్ట్రంలో ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయింపులు చేయకుండా కేటాయిస్తామని చెప్పి రాష్ట్ర ప్రజలను మరోసారి బిజెపి ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం చేసిన బిజెపి ప్రభుత్వం విధానాన్ని రాష్ట్ర ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తగిన నిధులు కేటాయింపులు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోలో సిపిఎం నాయకులు ఏ.జగన్మోహన్, పి.రమణమ్మ, బి.రమణ, యు ఎస్ రవికుమార్, సి హెచ్ వెంకటేష్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్కూల్ పిల్లలు స్కూల్ కి వెళ్ళని పరిస్థితి

### గెడ్డలోనే గిరిజనులతో కలసి నిరసన

అల్లూరి,జూలై25 (ప్రజా మంటలు): అల్లూరి జిల్లా దేవరాపల్లి, వాలాబు పంచాయతీ చివారు బోర్రచింత గిరిజనులు జల దిగ్బందనంలో చిక్కున్నారని సిపిఎం మండల కార్యదర్శి బిటి దోర పేర్కొన్నారు. గురువారం అతికష్టం మీద గ్రామాన్ని సందర్శించారు. అనంతరం గిరిజనులతో కలిసి పారుతున్న గెడ్డలో నిరసన తెలిపారు. అనంతరం అయిన మాట్లాడారు. గతవారం రోజులు నుండి కురుస్తున్న వర్షాలకు బోడ్డ గుమ్మి గెడ్డ ఉదృతంగా రావడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జలద్రిగ్బందంలో చిక్కుకోని నిత్యావసర వస్తువులు, విద్యా, వైద్యం అందక ముసలివారు, చిన్న పిల్లలు తీవ్ర అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని పూర్వకాలం నుండి గిరిజనులు పాలకులకు మోరపెట్టుకున్న పట్టించుకోవడం లేదన్నారు. గిరిజనులు పట్ల పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. దీంతో గిరిజనుల అభివృద్ధికి ఆమాడ దూరంలో ఉన్నారని అన్నారు. ఎన్నికల సమయంలో కనిపిస్తున్న పార్టీల నాయకులు , గిరిజనులు కష్టాల్లో ఉన్నప్పుడు ఎందుకు కనిపించడం లెదన్నారు. అడవిలో జంతువులపై ఉన్న ప్రేమ కూడా గిరిజనులపై లెదన్నారు. ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని జలద్రిగ్బందలో చిక్కుకున్న గిరిజనులను ఆదుకోవాలని దోర డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మడుగు మచిరాజు, టుకూరు రాములు, ముర్ల పైడితల్లి, నూకరాజు, దేవరాజు, భీమరాజు, గణెళిష్, గ్రామ పెద్దలతో సహా తదితరులు పాల్గొన్నారు.

# పశువుల కొట్టంలోకి దూసుకెళ్లిన బస్సు

ఆదిలాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ రాష్ట్రంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పశువుల కొట్టంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో దాదాపు 20 మంది ప్రయాణికులకు గాయాలైనట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలో కరంజీ (టి) నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్న బస్సు ఆర్లీ(టి) గ్రామంలోకి రాగానే అదుపుతప్పి బస్సు రోడ్డు పక్కనే ఉన్న బక్కి ఆనిల్ అనే రైతు కొట్టంలోకి దూసుకెళ్లి.. కట్టేసి ఉన్న ఎద్దును డీ కొట్టింది. ఆ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉండగా.. చాలా మందికి గాయాలు అయినట్లు చెబుతున్నారు. ఇక గాయాలు అయిన వారిని వెంటనే ఆస్పత్రికి కూడా తీసుకెళ్లారట. ఈ ప్రమాదంపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.



# మత్తు పదార్థాల వినియోగంతో భవిష్యత్తు అంధకారం అవుతుంది

### వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా




జనగామ జులై 25 (ప్రజామంటలు): గంజాయి లాంటి మత్తు పదార్థా లను సేవించి యువత తమ భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ విధ్యార్థులకు సూచించా రు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం పట్ల కలిగే నష్టాలపై జనగామ డివిజన్ పోలీసుల అధ్వర్యంలో జనగామ లోని క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో విధ్యార్థు లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమా నికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరయి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ విద్యార్థులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం ద్వారా నేడు యువత భవిష్యత్తు ప్రమాదంలో వుందని. ఈ ప్రమాదం భారీన పడకుండా యువత అప్రమత్తంగా వుండాలని. కేవలం క్షణికానందం కోసం మత్తు పదార్థాల సేవించడం ద్వారా మీరు అనుకున్న లక్ష్యాలను సాధించడం ఓ కలగానే మిగిలి పోతుందని. కొంత మంది వ్యక్తులు తమ డబ్బు సంపాదన కోసం గంజాయి లాంటి మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడి యువతకు అందించడం జరుగుతోందని. ఇలాంటి స్వార్థపరుల చేతుల్లో యువత బలికావద్దని. ఎన్నో అశలతో మిమ్మల్ని ఉన్నత చదువులు చదివించి మీ బంగారు భవిష్యత్తు కై ఎదురుచూసే తల్లిదండ్రులకు తమ పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలుగా మారడంతో తల్లిదండ్రులు ఎలాంటి వేదనకు గురౌవుతున్నారు. ప్రతి ఒక్కరు మీ తల్లిదండ్రుల గురించి ఒక్కసారి ఆలోచించండి. మత్తు పదార్థాల వినియోగం ద్వారా ఆర్థికంగా నష్టపోవడంతో పాటు, ఎన్నో ఆరోగ్య సమస్యలు చుట్టుముడు తాయని యువత గ్రహించాలని. అలాగే మీ తోటి మిత్రులు గంజాయిని సేవిస్తున్నట్ల యితే మత్తు పదార్థాల వినియోగం ద్వారా నష్టాలపై వారి అవగాహన కల్పించాలని. ప్రధానంగా గంజాయి లాంటి మత్తు పదార్థాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిస్తోందని. ఇందులో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి నియంత్రణకై డ్రగ్స్ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఎక్కడ్కెనా మత్తు పదార్థాలు సేవిస్తున్న, రవాణా, విక్రయాలు పాల్పడుతు న్న వారిపై పట్టుకోవడే ఈ విభాగం ప్రత్యేకతని. ఎవరైన మత్తు పదార్థాలు అమ్మిన, సేవించిన 87125 84473కు సమాచారం అందించడం ద్వారా వారిపై తగు చర్యలు చేపట్టడం జరుగుతుంద ని. పెద్దఎత్తున గంజాయి సమచా రం అందించిన వారికి నగదు పురస్కారం కూడా అందజేయ బడుతుందని. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా వుంచబడు తాయని పోలీస్ కమిషనర్ తెలిపారు. అనంతరం మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రమాణం చేయించ డంతో పాటు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన వాల్ పోస్టర్లను పోలీస్ కమిషనర్ ఆవిష్కరించార. ఈ సమావేసంలో వెస్ట్ జోన్ డిసిపి రాజ మహేంద్ర నాయక్ ,జనగామ ఎసిపి పార్థసారథి , ఘన్ పూర్ ఏసీపీ భీమ్ శర్మ, నార్కోటిక్ విభాగం ఏసీపీ సైదులు, క్రీస్తుజ్యోతి ఇంజరింగ్ కళాశాల డైరెక్టర్ రెవరెండ్ విజయ పాల్ రెడ్డి, డా. సిద్దారెడ్డి, ఇన్స్ స్పెక్టర్లు రఘుపతి రెడ్డి, మహేందర్ రెడ్డి, సాయిరమణతో పాటు జనగామ డివిజన్ ఎస్ఐ లు కళాశాల అధ్యాపకులు, విధ్యార్థులు పాల్గోన్నారు.

# బిజెపి కుత్సిత రాజకీయాలు !

రాజకీయాల్లో బుకాయింపులు, బెదరింపులు..ఎదురుదాడులు సర్వసాధారణమయ్యాయి. ఈ మధ్య ఇవి మరీ ఎక్కువయ్యాయి. బడ్జెట్ నిర్లక్ష్యంపై తెలంగాణ అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ సందర్భంగా అనేక విషయాలు గమనించవచ్చు. ప్రధానంగా బిజెపి ఈ విషయంలో తన దురుసుతనాన్ని ప్రదర్శించింది. అసెంబ్లీలో బిజెపి పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభలో నిర్మలా సీతారామన్‌లు చేసిన వ్యాఖ్యలు చూస్తే ఇలాంటి నేతలను ఎన్నుకున్నందుకు సిగ్గుపడాలి. బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయా లేదా అన్నది ప్రధాన అంశం. ఈ విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఖుల్లంఖుల్లాగా తేలింది.. బడ్జెట్‌లో ఎక్కడా తెలంగాణకు కేటాయింపులు జరిగిన దాఖలాలు లేవు. ఈ విషయంపై మాట్లాడుకోవడంలో తప్పు లేదు. అసెబ్లీలో చర్చించుకోవడంలోనూ తప్పులేదు. ఇది ప్రజలకు సంబంధించిన వ్యవహారం. కాంగ్రెస్, బిజెపిలకు మధ్యనో లేదా, బిఆర్ఎస్ కాంగ్రెస్‌కు మధ్య వ్యవహారమో కాదు. ఇది నాలుగుకోట్ల తెలంగాణ ప్రజలకు సంబంధించిన వ్యవహారం. ఈ విషయంలో పార్టీల నేతలతంతా జావాబుదారీగా ఉండాల్సిందే. బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష ప్రదర్శించారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ మొదటి నుంచి తెలంగాణ పట్ల కక్ష చూపిస్తున్నారని సిఎం రేవంత్ విమర్శించారు. కుర్చీని కాపాడుకునే విధంగా ఈ బడ్జెట్ ఉంని, బీహార్, ఎపిలను మాత్రమే ప్రధాని పట్టించుకున్నారని, ఇతర రాష్ట్రాలను పట్టించుకోలేదని సిఎం రేవంత్ విమర్శించారు. ఇండియా కూటమి నేతలు కూడా ఇదే విషయమై ఆందోళన చేశారు. రాష్ట్ర ఏర్పాటును అవమానించిన ప్రధాని మోడీ మొదటి నుంచి రాష్ట్రంపై కక్ష చూపిస్తున్నారని సిఎం రేవతం మండిపడడంలో తప్పులేదు. రాష్ట్ర మంత్రులతో కలిసి ఇప్పటికే 18 సార్లు కేంద్రాన్ని కలిసి విజ్ఞప్తి చేసినా, రాష్ట్రానికి న్యాయం చేయలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. 41లక్షల కోట్ల బడ్జెట్‌ను కేవలం ఎన్డీఏ మిత్ర పక్ష రాష్ట్రాలకే దోచిపెట్టారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడంలో తప్పులేదు. అయితే దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చాలా అపహాస్యంగా ఉన్నాయి. ఢిల్లీకి వచ్చింది మాకోసం కాదు..కాంగ్రెస్ పెద్దలను కలవడానికే అని ఎద్దేవా చేయడం ఆయన సంకుచిత రాజకీయాలను బయటపెట్టింది. నిజానికి కేటాయింపులు జరిగాయని ఇప్పటికీ కేంద్రమంత్రి చెప్పలేక పోతున్నారు. జరిగితే ఎక్కడ ఎంతమొత్తం పెట్టారో చెప్పాలి. కానీ అలా చెప్పకుండా ఎదురుదాడికి దిగారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకాక కేంద్రంపై విమర్శలు చేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని నడపడంలో తమ ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం బురదజల్లే డ్రామాలు ఆడుతోందని ఆరోపించారు. కేసీఆర్ ఎలాగైతే వ్యవహరించారో అదే తరహాలో రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బాటలోనే నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుస్తుండటం తెలంగాణ ప్రజల దురదృష్టమని తనదైన రాజకీయ విశ్లేషణ ఇచ్చుకున్నారు. రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరు తెలంగాణ ప్రజలందరినీ అవమానిం చేలా ఉందని కూడా మండిపడ్డారు. కొత్త రేషన్ కార్డులు, కొత్త పించన్లు లేవు సరికదా పాత పింఛన్లు కూడా ఇవ్వడం లేదని ఓ నిట్టూర్పు విడిచారు. ఎన్ని హామీలిచ్చారు..? ఏం చేశారో చెప్పమంటే చేతకాదు కానీ బడ్జెట్ పేరు చెప్పి అసెంబ్లీలో తీర్మానం పెడతారా? అని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగా కిషన్ రెడ్డి తన అక్కసునంతా ఇలా వెళ్లగక్కారు. అసలు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారా లేదా అన్నదానికి మాత్రం సమాధానం చెప్పలేకపోయారు. బయ్యారం ఉక్కు విషయంలో అక్కడ లభించే ఐరన్ ఓర్ నాణ్యత అంత బాగాలేదని నిపుణులు చెప్పారని మెల్లగా సెలవిచ్చారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో దేశ భవిష్యత్తుకు సంబంధించిన అనేక రకాల కార్యక్రమాలను పొందుపర్చారని అన్నారు. నిజాంగా రోగమొకటి అయితే మందు మరోటి అన్నట్లుగా కిషన్ రెడ్డి సమాధానం ఉంది. ఇలాంటి సమాధానాలతో ప్రజలను మభ్యపెట్ట లేమని కేంద్రమంత్రి గుర్తించివుంటే బాగుండేది. ఇక అసెంబ్లీలో పార్టీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అయితే తీర్మానం తప్పని, వాకౌట్ చేశారు. అసెంబ్లీలో చర్చ పెట్టి తీర్మానాలు చేయడం తప్పని అన్నారు. పార్టీ ఆదేశాలతో ఆయన కూడా నిజాలు మాట్లాడలేక పోయారు. కేటాయింపులపై నిర్మలా సీతారామన్ కూడా తన అక్కసు వెళ్లగక్కారు. బడ్టెట్‌లో అన్ని రాష్ట్రాల పేర్లు ఎలా ప్రస్తావిస్తామన్న కొత్త వాదనను ప్రకటిం చారు. బడ్జెట్ అనేది అంకెల కూర్పు లేదా కేంద్ర ప్రభుత్వ శాఖల వారీ కేటాయింపుల వ్యవహారం మాత్రమే కాదు. అది కేంద్ర ప్రభుత్వ వ్యవహారశైలికి, భవిష్యత్ దార్శనికతకు సంకేతం. ఆ రకంగా రాబోయే ఐదేళ్లు తెలంగాణ పట్ల మోదీ ప్రభుత్వ తీరు ఎలా ఉంటుందనడానికి ఈ బడ్జెట్ ద్వారా స్పష్టం అయ్యింది. బడ్జెట్ అనంతరం జరిగిన చర్చల్లో బీజేపీ నాయకుల వాదన అత్యంత పేలవంగా ఉంది. ఈ బడ్జెట్ రాష్ట్రాల వారీ కేటాయింపులు కాదు, శాఖల వారి కేటాయింపులు అని సమర్థించుకోవడం దాటవేత వ్యవహారంగా చూడాలి. తెలంగాణ గురించి అడిగితే డొంక తిరుగుడు సమాధానం చెప్పడం దారుణం కాక మరోటి కాదు. విభజన చట్టం గురించి ప్రస్తావిస్తూ ఏపీ గురించి మాట్లాడిన కేంద్ర ఆర్థికమంత్రి తెలంగాణ వెనుకబడిన ప్రాంతాల గురించి ఎందుకు మాట్లాడలేదంటే సమాధానం రాదు. బిహార్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రత్యేక నిధులు ఎందుకిచ్చారో..ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో దేశమంతటికీ అర్థమైంది. నితీష్‌కుమార్, చంద్రబాబు నాయుడు దయాదాక్షిణ్యాల మీద మోడీ పదవి, పరువు నిలబడి ఉంది. ఆ విషయం బీజేపీ నాయకత్వానికి బాగా తెలుసు. అందుకే ఈ అదనపు వడ్డింపులు అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. బీజేపీ గత వైఖరికీ నేటి పరిస్థితికీ ఉన్న తేడాను స్పష్టం చేసింది. తనకు తిరుగులేదని చాటుకున్న మోడీ ఇప్పుడు పిల్లిలాగా అణగిమణగి ఉండాల్సిందేనన్న విషయం బడ్జెట్ నిరూపించింది. ఈ విషయంలో నిజాలు అంగీకరించకుండా బిజెపి నేతలు ఇంకెంతో కాలం ఎదురుదాడికి దిగలేరు. దిగితే ప్రజలు ఎక్కడో ఒకచోట కర్రుకాల్చి వాతపెదతారని గుర్తించాలి. నిధులు కేటాయింపు అన్నది పార్టీల వ్యవహారం కాదు. అభివృద్ధి అన్నది ప్రజలకు సంబంధించినదిగా చూడాలి.

## వ్యాసకర్తలకు వినతి

రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.

mantalukathalu@gmail.com

-ఎడిటర్

ఈనెల 23 వ తేదీ 3 వ పేజీలో ప్రచురించబడిన "వ్యక్తిత్వం కంటే .. అవినీతి సంపద గొప్పదా? అనే వ్యాసం రాసినది ఫిజిక్స్ అరుణ్ కుమార్ నాగర్ కర్నూల్. పొరపాటున వేరే వారి ఫోటో, పేరున ప్రచురించ బడినది. పొరపాటుకు చింతిస్తున్నాం.

- ఎడిటర్.



## అంతేమరి..

స్వర్ణ ఒక్కర్తీ రైలు ఎక్కింది ఒక్కతీ ప్రయాణం చేసే అవకాశం తక్కువ వస్తుంది ఆమెకి. ఒక పుస్తకం చేత్తో పట్టుకు కూర్చొని, తిరగేస్తూ మిగతా బెర్తుల వాళ్ళ సంభాషణలు వినొచ్చు. కొత్త విషయాలు తెలుస్తాయి.
వాళ్ళకి తెలీకుండా వాళ్ళని గమనించడం, వాళ్ళ మాటలు వినడంశౌ% చాలా ఘషారుగా, ఉత్సాహంగా కూడా ఉంటుంది.
ఎదర బెర్త్ మీద ఇద్దరు, దాదాపు పాతిక ఏళ్ళ వయసు ఉన్న స్త్రీలు వచ్చేరు.
తనవేపు అప్పర్ బెర్త్ మీద ఒక పెద్దాయన వాలిపోయి నిద్రలో ఉన్నాడు.
సెకండ్ ఏసి చల్లగా హాయిగా ఉంది
రైలు జోరుగా వెళుతోంది.
ఎదర స్త్రీలు ఇద్దరూ కబుర్లు మొదలెట్టేరు. స్వర్ణ చెవులు రిక్కించి వింటున్నాది.

ఉన్నట్టుంది ఒకావిడ పక్కామెతో అన్నాది. "ఏం చెప్పమంటావే రాణీశౌ% మా ఇంట్లో నాకు రోజూ ఉన్న భాగోతంశౌ% ఈ అత్తగార్లతో పడలేకపోతున్నాను సుమా"
రాణీ "అదేమిటే సునీతా, అత్తగార్లంటున్నావు?" చిలిపిగా అంది.
"నోరుముయ్యే, అత్తగారి అక్కలూ, చెల్లెళ్ళూ కూడా అత్తగార్లేగాశౌ% అందునా మా అత్తగారికీ వాళ్ళ అక్కచెల్లెళ్ళకీ మధ్య మరీ బంధాలు ఎక్కువ "
"మీ అత్తగారు చాలా పనిమంతురాలట. నీకు గోరంతపని చెప్పరట కదాశౌ% నిజమా?"
"అంతవరకూ నిజమేలేశౌ% అసలు గోల ఎవరికీ తెలీదు. మా అత్తగారు వాళ్ళు ఆరుగురు అక్కచెల్లెళ్ళు. వాళ్ళ పెద్దక్కకి పిల్లలు లేరు. భర్తకూడా లేడు. ఆవిడే వీళ్ళందరికీ లీడర్. రోజంతా ఒకళ్ళతో మరొకళ్ళో, గ్రూప్ కాల్సో చేసుకుంటూ ఉంటారు."
"ఆపాటి సహకారం ఉండడం మంచిదేగా.."
సునీతకి ఒళ్ళుమండింది. "బాగుందేవ్శౌ% సహకారం ఉండకూడదని ఎవరన్నారు? వాళ్ళ కబుర్ల భాగోతం వింటే బుర్ర తిరుగుతుంది. ఎవరు ఎక్కడకి ప్రయాణం అయినాశౌ% ఒకటే ఫోన్లు.
'ఎన్నిగంటలకి బయలుదేరుతావు?'ఒక అత్తగారు.
'రైల్లో తినడానికి ఏం చేసేవు?' మరో అత్తగారు.
'ఒసే రైలు ఎక్కగానే చెప్పేశౌ%' చిన్నత్తగారు.
'అమ్మడూశౌ% నీకు ఇష్టం అని పూరీ కూరా చేస్తున్నానేశౌ% రైలు దిగగానే చెప్పు. రెడీ చేసేస్తాను. మరచిపోకొసే,' పెద్దత్తగారు.
ఇహ గంటకీ గడియకీ ఫోన్లే. రైలు 'ఎక్కడ ఉన్నాదే? తిన్నావా? లేదా?' అంటూ. అంత పిచ్చేమిటోశౌ% బోధపడదే" చిరాగ్గా అంది సునీత.




"మరీ అక్కరకాని విషయాలు మాడాడుకోవడమేమిటేశౌ%" రాణీకి నవ్వాగటం లేదు.
వింటున్న స్వర్ణకి గుండె ఆగినంత పనయింది. తామూ అయిదుగురు అక్కచెల్లెళ్ళే. తమ మధ్యకూడా, జోరు సంభాషణలు జరుగుతూ ఉంటాయి మరి. రేపొద్దుట తనకీ కోడలు వస్తేశౌ% ఇలాగే నవ్వుకుంటుందో ఏమో?
ఇంతలో ఆమె ఫోన్ ట్రింగ్ మంది.
ఫోన్ తీసేసరికి మూడో అక్క వర్ధని.
"ఏమే రైలు ఎక్కడ ఉందే? అవునూశౌ% పులుసు ఉప్పుపిండి చేసి రైల్లోకి తెచ్చుకుంటానన్నావు కదేశౌ% చేసేవా? మజ్జిగ వస్తే కొనుక్కో. దాహానికి అల్లాడతావుశౌ%" నాన్ స్టాప్ గా అక్క మాటాడుతూ ఉంటే, "అక్కా, సిగ్నల్ బాగాలేదే తరవాత చేస్తానులే ' అంటూ ఫోన్ పెట్టేసింది స్వర్ణ.

మంగు కృష్ణకుమారి,- 9553586346

## ప్రతికూల పరిస్థితులు

ఎముకలు కొరికే చలి
సముద్ర మట్టానికి
వెలకిలోమీటర్ల
ఎత్తు సియాచిన్ లో
నిత్యం దాడులు
శత్రు సైనికులు ఉగ్రమూకల
సహాయం తో దాడులు
తనువు చాలించేందుకు
సిద్ధమై దేశమాత పై తల్లికన్న
మామకారం
ప్రమాదం పొంచి ఉన్న
దేశ ప్రమోదమే మిన్న
ఆక్సిజన్ అందదు
నడుము చుట్టూ నీళ్లు
బరువైన ఆయుధాలు
అయిన నెరువడు
భయపడడుజి
వారి డేగ కళ్ళు
పగలు లేదు రాత్రి లేదు
రేయింబవళ్లు సర్వభౌత్వ రక్షణ
కూన్ బీ దేహింగే
జాన్ బీ దేహింగే
దేశ్ కా మిట్టి కాభి నహిదేహింగే
మన ప్రశాంతతకు వారు
కారణం
దేశమాత సేవల్లో నిజమైన
వీరులు
దేశమాత యోధులు
527 మంది బలిదానం
కార్గిల్ విజయ సోపానం
అచేతుహిమచెలం
నీకు అందిస్తుంది
సలాం సలాం
మాకు అక్షారాలు చాలవు
నీ త్యాగాలను వర్ణించా
అందుకే జై జవాన్
జై కిసాన్

ఉమాశేషారావు వైద్య
9440408080

## కార్గిల్ యుద్ధానికి పాతికేళ్ళు

ఎండలుకి, వానలుకి, మంచు గాలులికి లెక్క చేయకుండా వారి కుటుంబాలను కూడా మరచి , కేవలం దేశ రక్షణనే భుజానికెత్తుకొన్న వీరులే సైనికులు. వీరు భరతమాత ముద్దు బిడ్డలు. అటువంటి ఎంతో మంది వీరులు 1999 కార్గిల్ యుద్ధం లో పోరాట పటిమతో , ప్రాణాలను ఫణంగా పెట్టి ఎంతో నీచాతి నీచమైన పాకిస్థాన్ ను వెంటాడి తరిమి తరిమి, కొట్టి కొట్టి, మన దేశ పతాకాన్ని రెపరెప లాడించిన రోజే జూలై 26. కార్గిల్ యుద్ధంలో భాగంగా పాకిస్థాన్ సైన్యం ఆక్రమించిన పర్వత శిఖరాలను స్వాధీనం చేసుకున్న రోజు. ఈ యుద్ధంలో భారత సైన్యం సాధించిన విజయానికి గుర్తుగా ప్రతీ సంవత్సరం జులై 26 న కార్గిల్ విజయ్ దివాస్ ని యావత్ దేశ ప్రజలూ జరుపుకుంటారు. వీర మరణం పొందిన సైనికులకు నివాళులు అర్పిస్తారు . యుద్ధ వీరులను సత్కరించి దేశానికి వారు చేసిన సేవలను గుర్తుచేసుకుంటారు. దేశ సరిహద్దులను రక్షించే వీర సైనికులకు కృతజ్ఞతలు తెలియజేస్తారు. కార్గిల్ యుద్ధం జరిగి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లి ఉత్సవాలు జరుపుతున్నారు.

**ఏమి జరిగింది:**

ఒక్కసారి ఆ రోజులలో ఏమి జరిగిందో గుర్తుకు తెచ్చుకుందాం. 1971 ఇండో పాకిస్థాన్ యుద్ధం తరువాత మెదటిసారిగా రెండు దేశాలు నేరుగా సైనిక ఘర్షణకు దిగిన యుద్ధంగా ఇది నిలిచింది. అప్పటి ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజపేయి 1998 లో అణు పరీక్షలు జరిపారు. మే 3, 1999 న పాకిస్థాన్ దళాలు మరియు ఉగ్రవాదులు భారత నియంత్రణలో ఉన్న కార్గిల్ భూభాగం లోనికి చొరబడ్డారనే సమాచారంతోబీ భారత సైన్యం అప్రమత్తమైంది. మే 10 న భారత సైన్యం ఆపరేషన్ విజయ్ ప్రారంభించింది. మే 31న వాజపేయు గారు కార్గిల్ లో ఇది యుద్ధం లాంటి పరిస్థితి అని ప్రకటించారు. ఈ యుద్ధం సుమారు 18 వేల అడుగుల ఎత్తులో ఉన్న ప్రదేశాల్లో కొనసాగింది. అత్యంత సవాలుగా ఉండే భూభాగంలలో ఒకటిగా నిలిచింది.జూన్ 5 న పాకిస్థాన్ ప్రమేయాన్ని వెల్లడించే పత్రాలను మన సైన్యం విడుదల చేసింది. జూన్ 9 న బటాలిక్ సెక్టార్ లోని ముఖ్యమైన రెండు స్థావరాలను మన సైన్యం స్వాధీనం చేసుకుంది. అప్పటి నుండి మరో నాలుగు రోజులలోనే టోలోలింగ్ శిఖరాన్ని మన దేశం తిరిగిపొందింది. అప్పటి ప్రధాన మంత్రి గారు కార్గిల్ ను సందర్శించారు. జూలై 11 నాడు పాకిస్థాన్ దళాలు తోకముడిచి పారిపోయాయి. బటాలిక్ లోని మన ప్రాంతాలను మన సైన్యం స్వాధీనం చేసుకుంది. జూలై 14 నాడు ఆపరేషన్ విజయ్ విజయవంతం అయినదని మన సైన్యం ప్రకటించింది. ఈ యుద్ధంలో ఫిరంగిదళం, వైమానిక శక్తి మరియు పదాతిదళ కార్యకలాపాలను విస్తృతంగా ఉపయోగించారు. భారత వైమానిక దళం సంఘర్షణ సమయంలో వైమానిక సహాయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించింది, వ్యూహాత్మక స్థానాల నుండి శత్రువును తరిమికొట్టడానికి కీలకమైన వైమానిక దాడులు నిర్వహించింది. యుద్ధ సమయంలో భారత సైన్యం టోలోలింగ్, టైగర్ హిల్ మరియు పాయింట్ 4875 వంటి వ్యూహాత్మక శిఖరాలను తిరిగి స్వాధీనం చేసుకుంది. భారత ఆర్మీ అధికారి అయిన కెప్టెన్ విక్రమ్ బాత్రా, యుద్ధ సమయంలో తన ధైర్యసాహసాలు మరియు సాహసోపేతమైన చర్యలకు జాతీయ హీరో అయ్యాడు. అతని ప్రసిద్ధ పదాలు, "యే దిల్ మాంగే మోర్," ఐకానిక్‌గా మారాయి. జూలై 26 నాటికి కార్గిల్ యుద్ధం ముగిసింది. జై భారత్. జై జై భారత్.

జనక మోహన రావు దుంగ
8247045230

## రే"వంత్(తు)"మార్క్(ర్పు) రాజకీయం

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతవారం ఓ ప్రభుత్వ కార్యక్రమంలో మాట్లాడుతూ "ఒకప్పుడు ప్రజల సమస్యల గురించి పోలీస్ స్టేషన్లో యస్.పి కి నేను వినతిపత్రం ఇచ్చేవాణ్ణి.ఇప్పుడు వారు ప్రజల సమస్యల గురించి నాకు వినతిపత్రాలు ఇస్తే తీసుకునే స్థాయిలో వున్నా.అందుకే మీరు కూడా ఓ లక్ష్యం పెట్టుకొని ఎన్ని అవాంతరాలు ఎదురైనా లక్ష్యం పై ఫోకస్ పెట్టి కష్టపడితే జీవితంలో ఏమైనా సాధిస్తారు" అన్నారు.2006 లో మిడ్జిల్ మండలం జడ్పీటీసి గా రాజకీయ జీవితంలోకి ప్రవేశించి 18 సంవత్సరాలు గా తన కష్టంతో అంచెలంచెలుగా ఎదిగి నేడు తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి గా,దేశంలోనే కాంగ్రెస్ పార్టీలో కీలక నేతల్లో ఒకరిగా వుండటం వెనుక ఆయన ప్రయాణం స్ఫూర్తిదాయకమనే చెప్పాలి.

తెలుగుదేశం పార్టీలో చేరి,ప్రజల కోసం పనిచేసి స్వల్ప కాలంలోనే ప్రస్తుత నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దగ్గరవ్వడమే కాకుండా తెలుగుదేశం కార్యకర్తల అభిమానం, మద్దతు పొందారు.ఇప్పటికీ తెలంగాణ లోని తెలుగుదేశం కార్యకర్తలు రేవంత్ పై వున్న అభిమానాన్ని అవసరమైనప్పుడు ఓట్ల రూపంలో చూపుతున్నారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ ముఖ్యమంత్రి అయిన సందర్భంగా తెలుగు దేశం జెండాలు రెపరెపలాడాయన్నది అందరికీ తెలిసిందే.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగాక జరిగిన కొన్ని రాజకీయ పరిణామాల దృష్ట్యా రేవంత్ తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లోకి వచ్చారు.అనతికాలంలోనే తన చతురతతో,కష్టంతో, వాక్ చాతుర్యంతో రాహుల్ గాంధీ దృష్టిలో పడ్డారు.కొందరి రాజకీయ అనూహ్య చర్యల వల్ల 2018 అసెంబ్లీ ఎన్నికల్లో యంఎల్ఎ గా ఓడినప్పటికీ వెంటనే జరిగిన 2019 సార్వత్రిక ఎన్నికల్లో కూకట్ పల్లి నుండి కాంగ్రెస్ యంపీగా గెలిచి తన సత్తా చూపారు.ఇక అక్కడి నుంచి ఆయన దూకుడు రాజకీయం ప్రజల సమస్యల్ని పాలకులతో ప్రశ్నించడం వల్ల జననాయకుడిగా ఎదిగారు.కాంగ్రెస్ అంతర్గత రాజకీయ పోరును బలంగా ఎదుర్కొని టిపిసిసి అధ్యక్షుడు గా నియమించబడి యావత్ తెలంగాణ రాష్ట్రంలో సంచలనం అయ్యారు.రాహుల్ గాంధీ ప్రోత్సాహంతో రాష్ట్ర కమిటీ నాయకులను సమన్వయం చేస్తూ ఆరు గ్యారంటీలతో కూడిన హామీలతో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ అవాంతరాలను అధిగమించి సోనియాగాంధీ ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి గా అశేష జనసమూహం సాక్షిగా ప్రమాణస్వీకారం చేశారు.

2024 మే లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ నుంచి కాంగ్రెస్ అభ్యర్థులుగా 8మంది ఎంపీలు గెలవడంలో ప్రముఖ పాత్ర పోషించారు.ఇక ఎన్నికల ఫలితాల తర్వాత రేవంత్ తన మార్క్ (మార్పు) రాజకీయాన్ని చూపిస్తున్నారు.ఒక ప్రక్క ప్రజల కిచ్చిన గ్యారంటీ హామీలు నెరవేర్చే కార్యక్రమాల్లో పాల్గొంటూనే,రాజకీయ కోణంలో చేరికలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రైతులందరికీ ఆగష్టు 15 వరకు రెండు లక్షల రూపాయిలు ఋణమాఫీ చేస్తానని ఇచ్చిన గ్యారంటీ హామీని నెరవేర్చే పనిలో ప్రస్తుతం లక్షరూపాయల ఋణమాఫీ చేసి ముందడుగే వేసారని చెప్పవచ్చు. ఇంకా ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కూడా ఆయన ప్రజాపక్షంగా ఎదుర్కొవాల్సి వుంది. డియస్సి, గ్రూప్-1, గ్రూప్ -2, గ్రూప్-3 ఉద్యోగ నియామక పరీక్షలకు సంబంధించిన అభ్యర్థుల ఆందోళనలను తగ్గించడానికి గ్రూప్ -2 పరీక్షల నిర్వహణ తేదిని మారుస్తూ,డియస్సి పరీక్షను షెడ్యూల్ ప్రకారమే నిర్వహిస్తున్నారు.జాబ్ క్యాలెండర్ త్వరలోనే విడుదల చేస్తామని, మాది నిరుద్యోగులకు న్యాయం చేసే ప్రభుత్వమని సందేశాన్ని ప్రజలకు చెరవేస్తున్నారు.త్వరలోనే నిరుద్యోగులు ఉద్యోగ నియామకాల శుభవార్తలు జాబ్ క్యాలెండర్ రూపంలో వింటారనే నమ్మకాన్ని రేవంత్ కలగజేయడంలో కొంతమేరకు సఫలీకృతం అవుతున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పదేళ్ళు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వుంటుందని, రాహుల్ గాంధీ ని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని పదే పదే చెబుతున్న రేవంత్ ప్రజల మద్దతుతో ప్రజా సమస్యల్ని పరిష్కరిస్తూ తెలంగాణ పునర్నిర్మాణంలో కీలక బాధ్యత పోషించాలి.రాష్ట్ర విభజన సమస్యలు, ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చడం రేవంత్ ముందున్న పెద్ద సవాల్.ముఖ్యంగా వ్యవసాయం,విద్యా, వైద్యం, రంగాలకు ప్రాధాన్యత ఇస్తూనే పారిశ్రామిక పెట్టుబడులను కూడా పరుగులు పెట్టించటం రేవంత్ భవిష్యత్తు రాజకీయాలకు చాలా కీలకం.సాధారణ వ్యక్తి స్థాయి నుంచి ఎన్నో ఒడిదుడుకులతో, విమర్శలతో, రాజకీయ వివాదాలతో, న్యాయపరమైన కేసులతో అక్కడే ఆగకుండా నిత్యం పోరాడుతూ ముఖ్యమంత్రిగా ఎదిగిన రేవంత్ తన ఆత్మవిశ్వాసంతో ప్రజాపాలన అందిస్తూ తెలంగాణను భారతదేశానికి ముఖచిత్రంగా మార్చాలని, "నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న మహాకవి దాశరథి మాటల్ని నిజం చేస్తారని, మనమిచ్చిన పాలన బాధ్యతను సంపూర్ణంగా నిర్వర్తిస్తారని ఆశిద్దాం.

ఫిజిక్స్ అరుణ్ కుమార్
నాగర్ కర్నూల్, 9394749536

### గువ్వల వెంకటమ్మ మృతి, కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేసిన గుగ్గిల్ల నర్సయ్య



జనగామ జూలై 25 (ప్రజామంటలు): జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన గువ్వల వెంకటమ్మ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకుని కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి సహాయంగా 50 కిలోల బియ్యాన్ని కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక సేన, రాష్ట్ర కార్యదర్శి నేలపోగుల మాజి ఎంపిటిసి డాక్టర్ గుగ్గిల్ల నర్సయ్య అందించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడవెల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు దండిగా ఐలయ్య, ఉపాధ్యక్షుడు రాంనర్సయ్య, మాజీ అధ్యక్షుడు కత్తుల శ్రీనివాస్ రెడ్డి, యువత అధ్యక్షుడు అనిల్ యాదవ్, మాజీ ఎంపీటీసీ ఐలయ్య, మాజీ జెడ్పిటిసి కిష్టయ్య, బర్రెపాక యాదగిరి, బొల్లి గట్టయ్య, బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### కార్గిల్ విజయ్ దివస్ యుద్ధంలో అమరులైన సైనికులకు నివాళులు అర్పించిన భారత్ సురక్ష సమితి నాయకులు



జగిత్యాల జూలై 25 (ప్రజామంటలు): కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత్ సాధించిన విజయాన్ని పురస్కరించుకుని కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం జగిత్యాల పట్టణంలోని తహసిల్ చౌరస్తాలో గురువారం సాయంత్రం 4 గంటలకు కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికుల చిత్రపటాలకు పూలమాలలు వేసి కొవ్వొత్తులతో వారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు ఏ సిఎస్ రాజు, పుప్పాల సత్యనారాయణ కాశీ నాదం మాట్లాడుతూ.... కార్గిల్ విజయ్ దివస్ అనేది కార్గిల్ సంఘర్షణ సమయంలో మన దేశ సమగ్రత మరియు సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ధైర్యంగా పోరాడిన మన సాయుధ దళాల ధైర్యసాహసాలు మరియు త్యాగాలను గౌరవించే ముఖ్యమైన సందర్భం. ఈ మహత్తరమైన రోజును భావితరాలకు అందించే విధంగా మనమందరం పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏ సిఎస్ రాజు, సీనియర్ నాయకులూ పుప్పల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశినాధం, జిల్లా ఉపాధ్యక్షులు వేముల పోచమల్లు, వేముల దేవరాజం, బషెట్టీ ప్రభాకర్, మాజీ కౌన్సిలర్ బండారి మల్లికార్జున్, ఎడమల వెంకట్ రెడ్డి, గంధ్ర ప్రవీణ్ రావు, సిరిపురం గంగారం, గదసు భూమన్న, కొత్తకొండ బాలన్న, జి రామచంద్రం, సంపత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలు మెచ్చేలా రాష్ట్ర బడ్జెట్ కాంగ్రెస్ నాయకులు మహంకాలి రాజన్న



జగిత్యాల జులై 25 (ప్రజామంటలు): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యుల పాలిట వరమణి, ప్రజలు మెచ్చే బడ్జెట్ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహంఖాలి రాజన్న అన్నారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్ ను రూపొందించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు దిశగా ముందుకు సాగుతుంది. వ్యవసాయం రంగానికి కేటాయించిన బడ్జెట్ గత ప్రభుత్వం కన్న మూడింతలు పెరిగింది. అందుకే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం రైతు పక్షపాతి అయ్యింది. నిరుపేదలకు భారంగా మారిన విద్యుత్ బిల్, గృహజ్యోతి పథకాలకు కేటాయించిన బడ్జెట్ తో కొంత ఉపాశమనం లభించినట్టు అయిందని రాజన్న అన్నారు.

## కేంద్ర బడ్జెట్లో 25 కోట్ల పైగా ఉన్న దినసరి కూలీ ప్రజలకు తీవ్ర అన్యాయం

### ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ బొంకూరి రాజు



ఎల్కతుర్తి జులై 25 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండల కేంద్రంలో మనదేశంలో ప్రతిరోజు కూలి పని చేస్తే గాని పూటగడవని పేదలు దాదాపుగా 25 కోట్ల పైగా ఉన్నారు కేంద్ర బడ్జెట్లో పేద కూలి వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. పేద ప్రజల సంక్షేమానికి ఉపయోగపడే పథకాల్లోనే సబ్సిడీ బిల్లులో 7.8 శాతం కోత విధించారు దీని మూలంగా పేద ప్రజలకు ఇస్తున్న ఆహార సబ్సిడీపై ఎరువుల సబ్సిడీపై మరియు వంటగ్యాస్ సబ్సిడీపై కోత విధించడం వలన పేద ప్రజలకు ఆర్థిక భారం పెరుగుతుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయిన తరుణంలో వాటిని సబ్సిడీకి అందించాల్సింది పోయి ఉన్నవాటిపైనే కోత విధించి పేద ప్రజలు ఆకలితో అలమటించేలా ఈ బడ్జెట్ ఉందన్నారు. పల్లె ప్రాంతాల్లో ఆకలిని నిరోధించగలిగిన పథకంగా గుర్తింపు పొందిన ఉపాధి హామీకి ఈసారి బడ్జెట్లో సరిపడినంత కేటాయింపులు పెరగలేదు. ప్రభుత్వ విద్యారంగానికి మొత్తం బడ్జెట్లో కేవలం 2.5 శాతం లోపే కేటాయింపులు చేసి పేదలు చదువుకునే ప్రభుత్వ విద్యా వ్యవస్థ నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా విద్యా ప్రైవేటీకరణ యదేచ్ఛగా జరిగిపోవడానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు ఈ బడ్జెట్ ద్వారా తెలుస్తుందన్నారు. ఇది ముమ్మాటికీ పేద కూలి ప్రజలకు ఎలాంటి భరోసా లేని తీవ్ర అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్ అని ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ బొంకూరి రాజు అన్నారు.

### జనగామ హొటళ్ళలో తనిఖీలు 26 గృహావసరాల సిలిండర్లు పట్టివేత



జనగామ జూలై 25 (ప్రజామంటలు): గృహ అవసరాల కొరకు ఉపయోగించే సిలెండర్లను జనగామ పట్టణంలోని వివిధ హొటల్లలో వినియోగిస్తున్న విషయాన్ని తెలుసుకొని జిల్లా పౌరసరఫరాల అధికారి యం. రోజారాణి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. సిలెండర్ లను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు డి.టి.ఇ. శ్రీనివాసు, జి. దేవా తనిఖీ చేసి 26 సిలిండర్లు పట్టుకొని జనగామలోని శ్రీ వీరభద్ర గ్యాస్ ఏజెన్సీ వారికి భద్రత నిమిత్తం తదుపరి ఉత్తర్వులు అందేవరకు భద్రపరించేందుకు తరలించారు. గృహ అవసరాల కోసం ఉపయోగించే సిలెండర్లను హొటల్, బిర్యానీ హబ్, బిర్యానీ పాయింట్లు లాంటి వ్యాపార అవసరాలకు ఉపయోగించరాదని, అలా ఉపయోగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారిణి హెచ్చరించారు.



### రుణమాఫీ అయిన రైతులకు వెంటనే రుణాల మంజూరి

### చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి

మహాదేవపూర్ జూలై 25 (ప్రజామంటలు): మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో గురువారం రుణమాఫీ జరిగిన రైతులకు పాలకవర్గం స్వీట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్స్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ... రైతుల రుణమాఫీ పట్ల హర్షం వ్యక్తం చేశారు. సహకార సంఘంలో 172 మంది రైతులకు మొదటి విడత రుణమాఫీ జరిగిందని, రుణమాఫీ జరిగిన రైతులకు వెంటనే తిరిగి రుణాలు మంజూరు చేస్తున్నామని దీంతో రైతుల హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు సహకార సంఘం రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు తోట సుధాకర్, ఇబ్రహీం, దాసరి సమ్మయ్య, కృష్ణారావు, తిరుపతి రెడ్డి తో పాటు రుణమాఫీ అయిన రైతులు కార్యాలయ సిబ్బందితోపాటు పలువురు పాల్గొన్నారు.

## సీఎంఆర్ బియ్యం తరలింపు ప్రక్రియను ఆగస్టు 31లోగా పూర్తి చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్



జనగామ జూలై 25 (ప్రజామంటలు): జిల్లాలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ సంబంధిత రైస్ మిలర్ల అధ్యక్ష, కార్యదర్శులతో సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి తరలించే ప్రక్రియపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ.... ఖరీఫ్/రబీ 2023-24 సీజన్ కు సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని సకాలంలో రోజూ వారి లక్ష్యాల వారీగా ఎఫ్.సి.ఐ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి తరలించాలని సూచించారు. అలాగే బియ్యం అప్పగించే ప్రక్రియను వేగవంతం చేసి, ఆగస్టు 31లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డీసీఎస్ఓ రోజా రాణి, డియం ప్రసాద్, డిటి పౌరసరఫరాల శాఖ ఇ. శ్రీనివాసు, జి. దేవా, మిల్లర్ల అధ్యక్షులు పజ్జురి జయహరి, బెల్దీ వెంకన్న, చల్లా శ్రీనివాస్ రెడ్డి, ముత్తయ్య, దిలీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### జమ్మికుంట పట్టణంలో పశువులతో ప్రజల పరేషాన్

పట్టించుకోని మున్సిపల్ పాలకవర్గం, పోలీసు యంత్రాంగం

దిద్దుబాటు చర్యలకై సామాజిక కార్యకర్త షేక్ సాబిర్ అలి డిమాండ్



జమ్మికుంట జూలై 25 (ప్రజామంటలు): జమ్మికుంట పట్టణ రద్దీ ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్లలో సంచరిస్తున్న పశువులతో వాహనదారులు మరియు పట్టణ ప్రజలు పరేషాన్ అవుతున్నారు. ప్రధానంగా గాంధీ చౌరస్తా, రైల్వే స్టేషన్ రోడ్, బస్టాండ్ రోడ్ లలో పశువులు గుంపులు గుంపులుగా తిష్ట వేసుకుని ఉండి ట్రాఫిక్ నకు ఇబ్బందులు కల్పిస్తూ వాహనదారుల ప్రమాదాలకు కారణం అవుతూ ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తున్నాయి. ఈ వర్షాకాలం సందర్భాల్లో ప్రమాదం బారిన పడకుండా వాహనదారులే వాటిని పక్కకు తరలించి ప్రాయాణం కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. వీటిని నియంత్రించాల్సిన మున్సిపల్ సిబ్బంది కానీ ట్రాఫిక్ ను నియంత్రించాల్సిన పోలీస్ సిబ్బంది కానీ ఈ దిశగా చర్యలు చేపట్టకపోగా బదులుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తూన్నాను. కావున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పశువులను గోశాలకు తరలించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని మీ ద్వారా డిమాండ్ చేస్తున్నాను.

## బడ్జెట్ తో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం..

### జిల్లా పరిషత్ తొలి అధ్యక్షురాలు, దావ వసంత సురేష్



జగిత్యాల జులై 25 (ప్రజామంటలు): తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తో ప్రభుత్వ పాలన విధానం, వైఖరి స్పష్టం అయ్యింది. గత ప్రభుత్వం లో అమలు చేసిన పథకాలపై స్పష్టత లేకుండా పోయింది. దళిత బంధు పథకం ఊసే లేదు. వ్యవసాయ రంగంను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రైతు కక్ష్యపాతీగా బడ్జెట్ ను ప్రవేశపెట్టడం విచారకరం. రాష్ట్రానికి సంబంధించిన ఒక్క పాలసీ, ఫార్ములా లేకపోవడం ప్రభుత్వం పనితీరుకు నిదర్శనం. అంకెల గారడీ బడ్జెట్ తో ప్రభుత్వం అంతరంగం బహిర్గతం అయింది.

### విద్యకు ప్రాధాన్యత లేని రాష్ట్ర బడ్జెట్ టి.పి.టి.ఎఫ్



జనగామ జూలై 25 (ప్రజామంటలు): రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగానికి కేటాయింపులు చూస్తే విద్యాభివృద్ధిపై ప్రభుత్వం మాటలే తప్ప చేతలు లేవన్నట్టుగా స్పష్టం అవుతుందని టిపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 2,91,159 కోట్ల రాష్ట్ర బడ్జెట్ లో 21,292 కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారు. గత సంవత్సరం 6.56 శాతం కేటాయించగా ఇప్పుడు 7.31 శాతం కేటాయించారని, విశ్వవిద్యాలయాలకు గత ప్రభుత్వం ఇచ్చిన విధంగానే 500 కోట్లు మాత్రమే కేటాయించడం చూస్తే విద్య పట్ల ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగించనున్నదని తేటతెల్లమైందన్నారు. విద్యారంగంలో వినూత్న మార్పులు చేస్తామని, ఇంటర్నేషనల్ స్కూల్స్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నెలకొల్పుతామని తెలిపారు. కాని అందుకు తగిన విదంగా బడ్జెట్ కేటాయింపులు చేయకుండా గత ప్రభుత్వ బాటలోనే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగుతుందని, నిధుల కేటాయింపు పెంచకపోవడంతో విద్యను ప్రైవేటురంగానికి వదిలివేసే కుట్రగా భావించాల్సి వస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లో వాగ్దానం చేసిన విధంగా బడ్జెట్లో 15 శాతం నిధులు కేటాయించినా కనీసం 44.6 వేల కోట్ల నిధులు వచ్చేవని, కాని అందులో సగం కూడా కాకుండా 21.3 వేల కోట్లకే పరిమితమైందని, అరకొర నిధులతో అందరికీ ప్రమాణాలతో కూడిన, నాణ్యమైన విద్య అందని ద్రాక్ష కానున్నదని శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు.

## అంగన్వాడీలను పూర్వ ప్రాథమిక విద్యానిలయాలుగా ఆధునీకరించాలి

### కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జూలై 25 (ప్రజామంటలు): అంగన్వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్యానిలయాలుగా ఆధునికరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు గాను కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం (695) అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇందులో భాగంగా అన్ని మౌలిక సదుపాయాలు వీటిలో కల్పించాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో వేసే పెయింటింగ్ చిన్నారులకు విద్యా బోధన సులభంగా అర్థం అయ్యే విధంగా ఉండాలన్నారు. కేంద్రాల గోడలపై పెయింటింగ్ రూపకల్పన వినూత్నంగా ఉండాలని, అందుకు సంబంధించిన రూపకల్పన వివరాల నివేదికను సమర్పించాలన్నారు. అలాగే జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, లైట్ లు, ఫ్యాన్లు, ప్రహారీ గోడ, తాగునీరు, సంపులు, ట్యాంకులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తదితర సౌకర్యాల పనులన్నీ నాణ్యతతో చేపట్టాలని పంచాయతీరాజ్, మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, తరగతి గదులను వినూత్న పద్ధతిలో తీర్చిదిద్దాలన్నారు. వీటిలో ఈ మౌలిక వసతుల కల్పనకు పూర్తి బడ్జెట్ ప్లాన్ నివేదికను సమర్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తూ పిల్లలకు నాణ్యమైన ప్రీ ప్రైమరీ విద్యను అందించే విధంగా వాటిని బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జెడ్పీ సీఈవో అనిల్ కుమార్, డీడబ్ల్యూఓ జయంతి, డీఈఓ రాము, పీఆర్ ఈఈ శ్రీనివాస రావు, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ శ్రీకాంత్, సీడీపీఓలు ఫ్లోరెన్స్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

### బౌద్ధనగర్ అభివృద్ధి పనులపై అధికారుల రివ్యూ బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై చర్చ



సికింద్రాబాద్ జూలై 25 (ప్రజామంటలు): సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్ లో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రగతి, సమస్యలు, బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై జీహెచ్ఎమ్సీ అధికారులు గురువారం బౌద్ధనగర్ జీహెచ్ఎమ్సీ వార్డు కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్ లోని అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, ప్రస్తుత వర్షాకాలంలో సిబ్బందిని అలర్ట్ గా ఉంచాలని కార్పొరేటర్ కంది శైలజ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పనులను వేగవంతం చేయాలని, దోమల నివారణలకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిప్యూటీ కమిషనర్ సుభాష్ సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో వార్డు ఏఎంసీ ఓమర్, ఏఎంఒహెచ్ రజనీకాంత్, డీఈఈ, శానిటేషన్, ఎంటామాలజీ జవాన్ రాజు, హెచ్ఎమ్డబ్ల్యూఎస్, ఏఈ ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లా కలెక్టర్ బి, సత్య ప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసిన మెట్ పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ టీ. దేవరాజు



### పలు హొటల్స్, కిరాణ షాప్ లకు ఫెనాల్టీ

జగిత్యాల జూలై 25 (ప్రజామంటలు): పట్టణంలో సాధారణ తనిఖీలో భాగంగా జగిత్యాల పట్టణంలోని హొటల్స్ మరియు కిరాణ షాప్ లో కొన్ని ఫుడ్ శాంపిల్స్ తీసి ల్యాబ్ కు పంపడం జరిగినది. అట్టి ఫుడ్ శాంపిల్స్ లో నాణ్యత తక్కువ వున్నది అని ల్యాబ్ రిపోర్టు రావడం జరిగినది. కావున సంబంధిత షాప్ యజమానులకు మొదటి తప్పుగా కొంత మొత్తాన్ని అపరాధ రుసుముగా జాయింట్ కలెక్టర్ రాంబాబు వేయడం జరిగింది. 1. సామంతుల భోజనశాలకు రూ. 2,50,000, 2. సుఖీభవ రెస్టారెంట్ కు రూ. 50,000, 3. ఆనంద్ భవన్ కు రూ. 75,000, 4. నందిని సేవ మహల్ కు రూ. 35,000, 5. బెస్ట్ సూపర్ మార్కెట్ కు రూ. 1,00,000, 6. శివ సాయి కిరాణం కు రూ. 90,000, 7. శ్రీ రూప బెంగళూర్ బేకరీ కి రూ. 30,000. పై అపరాధ రుసుమును మొదటి తప్పుగా భావించి వేయడం జరిగింది. ఇక ముందు నాణ్యత గల సరుకులను అందించక పోతే కఠినమైన చర్యలు ఉంటాయని వ్యాపారులకు తెలియచేయడం అయినట్లు జగిత్యాల జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్, అనూష ఒక ప్రకటనలో తెలిపారు.



# కాంగ్రెస్, బిఆరెస్ దొందూ దొందే

## బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్

జగిత్యాల జూలై 25 (ప్రజామంటలు):

బడ్జెట్ కేటాయింపులో తెలంగాణా ఊసేలేదని తెలంగాణా పట్ల బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపిందని చేసిన వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని జగిత్యాల బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ విమర్శించారు. గతంలో బిఆరెస్ అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణా బడ్జెట్ మొత్తం సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ కు కేటాయించి మిగతా 116 నియోజకవర్గాలను విస్మరిస్తే గత ఏడు నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో దాదాపు అయిదువేల కోట్ల నిధులు ఒక్క కొడంగల్ కు మాత్రమే కేటాయించి 118 నియోజకవర్గాలను విస్మరించిన కాంగ్రెస్, బీఆరెస్ పార్టీలకు బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు.గతంలో మూడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారు మూడు గంటల పాటు మీడియా సమావేశం నిర్వహించి తొమ్మిది లక్షల కోట్ల నిదులకు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని అన్నారు. అందులో భాగంగానే ఉపాధి హామీ పథకానికి 32,414 కోట్లు వ్యవసాయ రంగ అభివృద్ధికి 1,345 కోట్లు పన్నుల్లో వాటాకు గాను 1,96,420 కోట్లు, సర్వ శిక్ష అభియాన్ కింద 8,114 కోట్లు అంగన్వాడీలకు 9,172 కోట్లు గిరిజన విశ్వవిద్యాలయానికి 980 కోట్లు కంపా పథకానికి 4,018 కోట్లు పెన్షన్ల కోసం 2,078 కోట్లు 14వ ఆర్థిక సంఘం ద్వారా 8,760 కోట్లు, 15వ ఆర్థిక సంఘం ద్వారా 10,882 కోట్లు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 9,597 కోట్లు స్మార్ట్ సిటీస్ కింద 500 కోట్లు అమృత్ పథకం కింద 3,856 కోట్లు ఎన్టీపీసీకి 10,997 కోట్లు విద్యుత్ రంగ బలోపేతానికి 7,086 కోట్లు, సాగునీటి కోసం 2,436 కోట్లు, జాతీయ రహదారులకు 1,58,000 కోట్లు, రైల్వేల అభివృద్ధికి 34,992 కోట్లు, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనకు 2,672 కోట్లు, జలజీవన్ మిషన్ కింద 1,582 కోట్లు, కిసాన్ సమ్మాన్ నిధికి 10,086 కోట్లు, కనీస మద్దతుధర, ధాన్యం సేకరణకి 1,86,640 కోట్లు, ఎరువుల సబ్సిడీ కోసం 46,000 కోట్లు రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్దరణ కొరకు 6,500 కోట్లు, వరంగల్, ఆదిలాబాద్ మెడికల్ కాలేజీలకు 240 కోట్లు, ఆయుష్మాన్ భారత్ కోసం 902 కోట్లు, జాతీయ ఆరోగ్య మిషన్ కింద 6,968 కోట్లు, కరోనా వ్యాక్సిన్ కోసం 1,800 కోట్లు, స్వచ్ఛభారత్ అభియాన్ కింద 4,418 కోట్లు, ప్రధానమంత్రి గరీబు కళ్యాణ్ అన్న యోజన కింద 1,425 కోట్లు, రీజినల్ రింగ్ రోడ్డుకు 20,000 కోట్లు, ముద్ర యోజన పథకానికి 58,471 కోట్లు, ప్రదానమంత్రి స్వనిదికి 840 కోట్లు ఇలా తొమ్మిది లక్షల కోట్లకు సంబందించిన వివరణ ఇచ్చినప్పుడు మీ నోర్లు ఎందుకు తెరవ లేదని కాంగ్రెస్, బిఆరెస్ పార్టీలకు ప్రజల సొమ్ము దోచుకొని దాచుకోవడం తప్ప ప్రజా సంక్షేమం పట్టదని దుయ్యబట్టారు.ఈసమావేశములో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి భూమి రమణ కుమార్, జిల్లా నాయకులు కస్తూరి సత్యం, పవన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు బడ్జెట్లో గుండుసున్న సిపిఐ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలు దగ్నం



ఎల్కతుర్తి జూలై 25 (ప్రజామంటలు):

ఎల్కతుర్తి బస్టాండ్ కూడలి వద్ద సిపిఐ పార్టీ కార్యకర్తలు ధర్నా చేశారు తెలంగాణకు బడ్జెట్ కేటాయించకపోవడం దురదృష్టకరమని జిల్లా కార్యవర్గ సభ్యులు మండల కార్యదర్శి ఊట్కూర్ రాములు మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుహిత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణకు సవతితల్లి ప్రేమ చూపించారు. అదేవిధంగా సాధారణ బడ్జెట్లో తెలంగాణ పేరు పెట్టకపోవడం చాలా అన్యాయం అదేవిధంగా దీనికి కేంద్ర మంత్రులు తెలంగాణ రాష్ట్రంలో ఎనిమిది మంది పార్లమెంట్ సభ్యులు గెలిచిన కూడా గెలిసి ఈ బడ్జెట్ పెట్టకపోవడం దీనికి నైతిక బాధ్యత వారు భరించవలసింది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి తగిన గుణపాఠం ప్రజలు చెప్తారు బిజెపి వత్తాసు పలికిన ఆంధ్రప్రదేశ్ మరియు బీహార్ కు బిజెపి అమ్ముడు పోయిందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రే లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యులు మర్రి శ్రీనివాసు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి శనిగరపు రాజ్ కుమార్, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు తండా మొండయ్య, నిర్మల మనోహర్, మర్రి విజయ్, సుర మొగిలి, పిన్ రెడ్డి మోహన్ రెడ్డి, గుంత మల్లయ్య, భాస్కర్ రెడ్డి, ఇంజాల పోచయ్య, జూపాక రవీందర్, పెండ్యాల ఐలయ్య, పి. రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సారంగాపూర్ కస్సుర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

## విద్యార్థులకు బోధిస్తున్న అంశాల పై ఆరా - పాఠశాలలోని వంటశాల, స్టోర్ సందర్శన

## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, నాణ్యమైన విద్యను అందించాలి

సారంగాపూర్ జూలై 25 (ప్రజామంటలు):



విద్యార్థుల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, నాణ్యమైన విద్యా బోధన చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. ఈ సందర్భగా 8,9, 10 తరగతుల విద్యార్థులకు ఇంగ్లీషు, బైలాజీ, భౌతిక శాస్త్రం. విద్యార్థులకు గణితం, సబ్జెక్ట్ ల పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రధానోపాధ్యాయురాలిని ఆదేశించారు. ఇప్పటినుండి 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇప్పటినుండి పదవ తరగతి సిలబస్ పై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులను అడిగి పాటలు సరిగ్గా చెబుతున్నారు లేదా అని తెలుసుకున్నారు. ఈసారి ఇంటర్మీడియట్ విద్యార్థులు జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెరగాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, తయారీ విధానమును స్టోర్ రూమ్ లను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనము మెనూ ప్రకారం అందించాలని పేర్కొన్నారు. శుభ్రమైన తాగునీరు కూడా అందించాలని తెలిపారు.పాటశాల ఆవరణలోని , పరిసరాలను స్వయంగా పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచే విధంగా తగు చర్యలు తీసుకోనీ, చేయాలని తెలిపారు. పాఠశాలలోని ఉపాధ్యాయురాల, ఉపాధ్యాయుల వివరాలు అడిగి తెలుసుకుని హాజరు పట్టిక మరియు సాధారణ సెలవు రిజిస్టర్ లను పరిశీలించినారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మధు సుదన్, సంబంధిత జిల్లా అధికారులు, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గార్డియన్ స్కూల్లో ఘనంగా బోనాల వేడుకలు..!

## ఆటపాటలతో పిల్లల కేరింతలు

## సంస్కృతి సాంప్రదాయాలను పిల్లలకు నేర్పించడమే మా లక్ష్యం

## గార్డియన్ స్కూల్ ప్రిన్సిపాల్ మహమ్మద్ అంకూస్

జమ్మికుంట జులై 25 (ప్రజామంటలు):



జమ్మికుంట మున్సిపల్ పరిధి లోని కొత్తపల్లిలో సాహితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గార్డియాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గురువారం లస్కర్ బోనాలు నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా మహంకాళి అమ్మవారి చిత్రపటానికి పూలు పండ్లు సమర్పించి, మట్టి పాత్రలతో బోనం తయారుచేసి నైవేద్యాన్ని సమర్పించడం జరిగింది. పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను పిల్లలకు తెలియపరచడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లలకు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను తెలియపరచి రానున్న రోజుల్లో సాంప్రదాయాలను కాపాడే రకంగా విద్యార్థి దశ నుండే వారికి అలవర్చాలని చదువుతోపాటు సంస్కృతి క్రమశిక్షణ సాంప్రదాయాలు చిన్నప్పటి నుండే నేర్పించడమే మా ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తెలంగాణలోని ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

## ఆ మార్పు రావాలంటే వచ్చే

## అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పార్టీ రావాలి



ఎల్కతుర్తి జులై 25 (ప్రజామంటలు):

తెలంగాణ రాష్ట్ర ప్రజల బతుకులు మారాలి మార్పు రావాలి అని తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మాయ మాటలు చెప్పి అమలు కాని హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలు దిక్కులేదు సరైన సమయానికి రైతుబంధు లేదు అవ్వ తాతలకు పింఛను లేదు 24 గంటల కరెంటు లేదు వడ్లకు ఇస్తానన్న 500 బోనస్ లేదు జర్నలిస్టులకు స్వేచ్ఛ లేదు రైతులకు సాగునీరు లేదు పరిపాలన మీద దృష్టి లేదు నిరుద్యోగులను నమ్మించి ఇస్తామన్న ఉద్యోగాలు లేవు ఆటో అన్నల ఆకలి కేకలు రుణమాఫీ పై ఆంక్షలు ఎండిన పంటలకు పరిహారం లేదు ఆడబిడ్డలకు ఇస్తానన్న 2500 లేవు నిరుద్యోగ భృతి లేదు పెంచిన పెన్షన్లు లేవు రైతు బంధువు లేదు వంట గ్యాస్ 500 లేదు నేత నెలకు బకాయిలు లేవు. యువతకు ఉద్యోగాలు లేవు. నేతన్నలకు బకాయిలు లేవు. ఆడపిల్లలకు భద్రతా లేదు. ప్రశ్నిస్తే కేసులు దాడులు, హత్యలు. ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే లను కొనడంలో పెడుతున్న శ్రద్ధ పరిపాలన మీద లేదు. మీ మాటలకు మోసపోయిన తెలంగాణ రాష్ట్ర ప్రజలు వద్దురా నాయన కాంగ్రెస్ పాలన అంటున్నారని 56వ డివిజన్ అధ్యక్షులు మందోటి మహేందర్ పటేల్ అన్నారు.

# టేకుర్తి ఆదర్శ పాఠశాలలో శిక్ష సప్త వేడుకలు

జమ్మికుంట జులై 25 (ప్రజామంటలు):



నూతన జాతీయ విద్యా విధానం 20 20 ప్రారంభించి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున కేంద్ర ప్రభుత్వం నిర్వహించే శిక్ష సప్త వేడుకలు ఆదర్శ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు నిర్వహించే భిన్నత్వంలో ఏకత్వంలో సూచించే ప్రదర్శనలైనా బోనాలు బతుకమ్మ వేడుకలు ప్రదర్శించారు. అదేవిధంగా జాతీయ సమగ్రతను పెంపొందించే పోస్టర్లు నినాదాలు తయారుచేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీధర్ బాబు, పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మాతృదర్శన్ ట్రస్ట్ వారిచే ఉచిత ఆరోగ్య శిబిరం

జనగామ జూలై 25 (ప్రజామంటలు): మాతృదర్శన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు స్వర్గీయ ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని, ట్రస్ట్, లయన్స్ క్లబ్ జనగామ సౌజన్యంతో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రస్టీ సీతారమణి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా పాల్గొన్న కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సంజీవ రెడ్డి ట్రస్ట్ సేవా కార్యక్రమాలను వివరిస్తూ, ప్రొఫెసర్ ఆదర్శాలను కొనసాగిస్తూ, గ్రామీణ సేవా కార్యక్రమాలకు తోడ్పాటు అందించడంలో ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. లయన్స్ క్లబ్ వారి సహకారం వెల కట్టలేనిదని తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో గ్రామీణ వాసులు, అదితి పిల్లలు, న్యూ క్రియేషన్ స్కూల్ పిల్లలు, తల్లిదండ్రులు సుమారు 300 మంది వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో న్యూరాలిజిస్టు డాక్టర్ రంజిత్, పీడియాట్రిషియన్ డాక్టర్ కనకరాజు,ఆప్తొమోలోజిస్ట్ డాక్టర్ శివ,డెంటిస్ట్ డాక్టర్ సతీష్,జనరల్ ఫిజిషియన్ డాక్టర్ కార్తీక్,డెర్మటాలజిస్ట్ డాక్టర్ విజ్ఞశ్రీ వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వంశీ, లయన్ కృష్ణ బజాజ్, జి.ప్రమోద్ కుమార్, పులగం సురేష్, ఎం. శ్యామసుందర్, ట్రస్ట్ పిఆర్ఓ చంద్రశేఖర్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో

# మాతలచే సామూహిక అనఘా వ్రతం

జగిత్యాల జూలై 25 (ప్రజామంటలు):



జిల్లా కేంద్రంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి పలు పుష్పాలతో చక్కగా అలంకరించి మంగళహారతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయం 10 గంటలకు భక్తిశ్రద్ధలతో ఘనంగా విశేష సంఖ్యలో మాతలు పాల్గొన్ని సామూహిక అనఘా వ్రతం పూజా క్రతువులను అలయ అర్చకులు సిరిసిల్ల భాస్కర్ శర్మ, వేణుగోపాల్ శర్మ నిర్వహించారు. అనంతం భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం నార్ల రజని, గంప రజని, పాత రాధ, ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నార్ల దినేష్, దొంతుల శ్రీనివాస్, క్యాస ప్రణయ్, మార రాజేశం, పల్లెర్ల కిషన్, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్లో ప్రాధాన్యత రంగాలకు అన్యాయం ఎన్నికల హామీలు నీటి మూటలే



## సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి

జమ్మికుంట జూలై 25 (ప్రజామంటలు):

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్లో ప్రాధాన్యత రంగాలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. విద్య వైద్యం, ఉత్పాదక రంగాలకు బడ్జెట్లో అరకొరనిధులే కేటాయించారు. 2,91,159 కోట్ల బడ్జెట్ ప్రతిపాదించినప్పటికీ కరీంనగర్ జిల్లాకు మొండి చేయి చూపారన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ కు నిధులు కేటాయింపులు లేవన్నారు. జిల్లాలోని పెండింగ్ పనులకు నిధులు కేటాయించలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, వాగ్దానాలు నీటి మూటలే అయ్యాయి అన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు 2500 ఇస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు అనుగుణంగా బడ్జెట్లో కేటాయింపులు లేవన్నారు. రైతు భరోసా కింద ఈ వానాకాలం ఎకరానికి రూ.15000 హులక్కేనా? ఇందిరమ్మ ఇండ్లు రాష్ట్రంలో నాలుగు లక్షల 50 వేలు నిర్మించ తలపెట్టామని బడ్జెట్లో పేర్కొన్నప్పటికీ నిధుల కేటాయింపులో స్పష్టత లేదన్నారు. పెన్షన్ల పెంపు ఇక ఈ ఏడాది లేనట్టేనన్నారు. నిరుద్యోగ భృతి హామీ ఏమైంది అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు కేవలం 3836 కోట్లు మాత్రమే ప్రతిపాదించారని ఇది ఎంత మాత్రం సరిపోదు అన్నారు. వెనుకబడిన తరగతులకు సంక్షేమం కోసం కేవలం 9,200 కోట్లు మాత్రమే ప్రతిపాదించారన్నారు. నీటిపారుదల రంగానికి తగిన నిధులు కేటాయించలేదన్నారు. సన్న రకం ధాన్యానికి మాత్రమే క్వింటాల్కు రూపాయలు500 బోనస్ వచ్చే సంవత్సరం నుండి ఇస్తామని ప్రకటించడం సిగ్గుచేటు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పిస్తూ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే పశుసంవర్ధక శాఖకు కేవలం 1980 కోట్లు ప్రకటించడం అవివేకమన్నారు. ఈ బడ్జెట్లో గత ఆరేళ్ళ నుండి పెండింగ్లోఉన్న స్కాలర్ షిప్స్ మరియు ఫీజు రీయంబర్స్ మెంట్స్ 7 వేల కోట్లకు పైగా పెండింగ్ లో ఉన్నాయి. వాటికి విడుదల కోసం నిధులు కేటాయించలేదు. తక్షణమే బడ్జెట్ ను సవరించి ప్రాధాన్యత రంగాలకు నిధులను పెంచి, జిల్లాకు అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# రేణుకుంట్ల కు జాతీయ గురుభ్యోనమః ప్రశంసాపత్రం

జనగామ జూలై 25 (ప్రజామంటలు):



జనగామ పట్టణానికి చెందిన ప్రముఖ కవి,రచయిత, గాయకులు,విశ్వంభర సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, రేణుకుంట్ల మురళి కి జాతీయ స్థాయి "శ్రీ గురుభ్యోనమః ప్రశంసాపత్రం" లభించింది. గురు పౌర్ణమి సందర్భంగా హైదరాబాదు కేంద్రంగా అంతర్జాల ద్వారా జాతీయ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని తాను రాసిన పాట "చీకటిని పారదోలి వెలుతురును ఇస్తారు గురువులు మా గురువులు, అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని ఇస్తారు గురువులు మా గురువులు" పాడినందుకు తన ప్రతిభను గుర్తించి ఈ పురస్కారం అందించారు. అంతర్జాతీయ స్థాయిలో ఐఎస్ఓ గుర్తింపు పొందిన తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిషా, పాండిచ్చేరి, యానాం రాష్ట్రాలకు చెందిన ప్రముఖ కవులు, రచయితలతో పాటు మురళి పాల్గొని ఇరవై ఐదు మంది విజేతలలో పదహారవ స్థానంలో నిలిచి అందరి ప్రశంసలు పొందారు. జాతీయ అధ్యక్షులు రవి శేఖర సత్యనారాయణ మూర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్వీ పౌండేషన్ చైర్మన్ మోటూరి నారాయణరావు, ప్రధాన సలహాదారులు కిలపర్తి దాలినాయుడు,గౌరవ అధ్యక్షులు గంటా మనోహర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మీసాల చినగౌరి నాయుడు,తెలంగాణ అధ్యక్షురాలు పైడి నవనీత రవీందర్, మహిళ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ బిహెచ్ రమాదేవి,న్యాయనిర్ణేతలు డాక్టర్ గౌరవరాజు సతీష్ కుమార్ మున్నగు పండిత పునీతులందరు అభినందిస్తూ ఈ ప్రశంసాపత్రం అందజేశారు. గురువులకున్న ఔన్నత్యాన్ని పాట ద్వారా చక్కగా అభివర్ణించి ప్రశంసలు అందుకున్న మురళిని జనగామ కవులు, కళాకారులు, రచయితలు, సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్, రాష్ట్ర ప్రగతికి నిదర్శనం

## జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి

జగిత్యాల జూలై 25 (ప్రజామంటలు):



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రగతికి నిదర్శనం. వ్యవసాయం కు ప్రాధాన్యత ఇవ్వడం హర్షనీయం. అలాగే వంటింటి భారం తగ్గించేందుకు సిలిండర్ లకు, ప్రతి ఇంటికి జీరో కరెంట్ కు నిధులు కేటాయించడంతో పాటు, స్త్రీ శిశు సంక్షేమ శాఖకు కేటాయించిన నిధులతో మహిళా సంరక్షణ కు పెద్ద పీట వేశారు. విద్యకు ప్రాధాన్యత, ఎస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీ ల సంక్షేమంకు కేటాయించిన నిధులతో సబ్బండ వర్గాల బడ్జెట్ నిలిచింది. ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రగతికి నిదర్శనం.

## ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులను నిరాశ పరిచిన రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్

### జెఏసీ మాజీ చైర్మన్, దేవిప్రసాద్



హైదరాబాద్ జులై 25 (ప్రజామంటలు): చాలాకాలం నుండి ఉద్యోగ సంఘాల కరువు భత్యం 5 విడుతలు విడుదల చేయాలని చేసిన డిమాండ్ ను పట్టించుకోక పోవడం అన్యాయమని, బడ్జెట్ పూర్తిగా అందరినీ నిరాశపరిచిందని ఉద్యోగ సంఘాల జెఏసీ మాజీ చైర్మన్ దేవిప్రసాద్ విమర్శించారు. అక్టోబర్ 24 వరకు పి ఆర్ సి గడువు పూర్తి అవుతుంది, 2024 లో పి ఆర్ సి ఇవ్వమని బడ్జెట్ స్పష్టం చేసింది, ఎలాంటి కేటాయింపు లేదు, కనీసం మధ్యంతర భృతి ప్రస్తావన లేదు. ఏప్రిల్ నుండి ప్రతి నెల వందలాది ఉద్యోగులు పదవి విరమణ చేస్తున్నారు వారికి రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ తో పాటు ఉద్యోగుల కు రావలిసిన నిధులు 5000 కోట్ల రూపాయలు పెండింగ్ లో ఉన్నాయి, అధికారం లోకి రాగానే తక్షణ చెల్లింపు చేస్తామని హామీ ఇచ్చి కేటాయింపు లు లేకపోవడం ఉద్యోగులను మోసం చేయడమే 2 లక్షల ఉద్యోగులను నియమిస్తామని చెప్పి ఎలాంటి కేటాయింపు లు చేయకపోవడం కాంగ్రెస్ పార్టీ కి నిరుద్యోగుల పట్ల ఉన్న ప్రేమ తెలిసిపోయింది. ఉద్యోగ ఉపాధ్యాయులకు ఈహెచ్చేస్ బలోపేతం చేస్తాం అని చెప్పి ఎలాంటి ప్రస్తావన లేదు. మొత్తం బడ్జెట్ లో ఎక్కడ వెతిక ినా ఉద్యోగుల సంక్షేమం కనపడలేదు, అమరవీరుల కుటుంబాల కోసం, ఉద్యమకారుల కు అనేక హామీలు ఇచ్చి అధికారం లో కి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ఎలాంటి పథకం ప్రకటించలేదు, ఆరు గ్యారంటీలు కేవలం నినాదంగా మా రింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజ్ పై ఎలాంటి హామీ లేదు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఊసే లేదు. అంగన్వాడీ, ఆశ, లాంటి ఉద్యో గుల వేతనాల హెచ్చింపు పై ఎలాంటి హామీ లేదు, పైగా మహిళా సంక్షేమ నిధులను భారీగా తగ్గించింది. బడ్జెట్ లో తెలంగాణ ఉద్యో గుల పట్ల విచక్షత మాత్రమే ఉంది ప్రేమ లేదని విమర్శించారు.

# యువతకు కాగడా అందించే తరుణం

### అధ్యక్ష బరినుంచి తప్పుకోవడంపై బైడెన్ వివరణ

### దేశం కోసమే తన నిర్ణమని వివరణ



వాషింగ్టన్,జూలై25 (ప్రజా మంటలు): అమెరికా అధ్యక్ష ఎన్నికలు-2024 రేసు నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించిన అనంతరం ప్రెసిడెంట్ జో బిడెన్ తొలిసారి బుధవారం స్పందించారు. అమెరికా మార్గదర్శకత్వాన్ని యువతరానికి అందిస్తున్నానంటూ ఆయన వ్యాఖ్యానించారు. యువ గళాలకు కాగడాను అందించాల్సిన తరుణం ఆసన్నమైందని ఆయన అన్నారు. ఈ మేరకు అమెరికన్లను ఉద్దేశించి 'ఓవల్ ఆఫీస్' నుంచి ఆయన చారిత్రాత్మకమైన ప్రసంగం చేశారు. డెమొక్రాటిక్ పార్టీని, దేశాన్ని ఏకం చేసేందుకే తాను 2024 ఎన్నికల నుంచి వైదొలగుతున్నట్టు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్యం సంరక్షణ అన్నింటి కంటే ముఖ్యమైనదని, నవతరానికి కాగడాను అందించడమే ఉత్తమ మార్గం అని తాను నిర్ణయించుకున్నానని, అమెరికాను ఐక్యం చేయడానికి అదే ఉత్తమ మార్గమని ఆయన అన్నారు. కష్టపడే సామర్థ్యం ఉన్న వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ డెమొక్రాటిక్ పార్టీ ప్రెసిడెన్షియల్ నామినీగా ఎంపికయ్యారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. డొనాల్డ్ ట్రంప్‌తో పోల్ డిబేట్‌లో జో బైడెన్ వెనుకబడడం, ఆ తర్వాత ట్రంప్‌పై హత్యాయత్నం నేపథ్యంలో ఎన్నికల రేసు నుంచి తప్పుకో వాలంటూ డెమొక్రాటిక్ శ్రేణులు బైడెన్‌పై తీవ్రమైన ఒత్తిడి తీసుకొచ్చాయి. దాదాపు రెండు వారాల తర్వాత ఆయన రేసు నుంచి వైదొలిగారు. దీంతో భారతీయ మూలాలు ఉన్న కమలా హ్యారీస్ రేసులోకి వచ్చిన విషయం తెలిసిందే. అమెరికా రాజకీయాల్లో ప్రతీకారాలకు ముగింపు పలకాలని, దేశం కంటే ఏ నియంతృత్వం, నిరంకుశం ఎక్కువ కాదు అంటూ బైడెన్ పవర్ ఫుల్ ప్రసంగం ఇచ్చారు. యువ గళాలకు, సరికొత్త నేతలకు సమయం సమయం ఆసన్నమైందని, ఆ సమయం ఇదేనని అన్నారు. కాగా జీవితంలో అత్యంత కీలక ప్రసంగం చేస్తున్న సమయంలో ఆయన కుటుంబ సభ్యులు ఓవల్ కార్యాలయంలో ఆయన ముందు కూర్చొని విన్నారు. ఆయనకు సపోర్టుగా అక్కడే ఉన్నారు. భార్య జిల్ బైడెన్, కూతురు యాష్లే, కొడుకు హంటర్ ఉన్నారు. ప్రసంగం ముగిసిన తర్వాత ఆయన వద్దకు వెళ్లి ఆప్యాయంగా చేతులు పట్టుకున్నారు. బిడెన్ మనవరాళ్లు కూడా ఓవల్ ఆఫీస్‌కు వచ్చారు. అధ్యక్షుడు జో బైడెన్ ప్రసంగంపై రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష నామినీ డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. వండి వార్చిన జో బిడెన్ ఓవల్ ఆఫీస్ ప్రసంగం అర్థమైంది. చాలా చెడ్డగా ఉందని ట్రంప్ అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. కాగా అధ్యక్ష ఎన్నికలకు ఫిట్ కాని వ్యక్తి అధ్యక్షుడిగా మాత్రం ఎలా కొనసాగుతారని, వైగొలగాలంటూ రిపబ్లికన్ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అధ్యక్షుడిగా పనిచేయడానికి ఆయన తగినవాడు కాదని అంటున్నారు. విమర్శలకు జో బైడెన్ సమాధానం ఇచ్చారు. తాను కుంటివాడిని కాదని, పదవిలో ఉన్నంత కాలం ఆర్థిక వ్యవస్థ, కీలకమైన విదేశాంగ విధాన సమస్యలపై పని చేస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. రాబోయే ఆరు నెలల్లో తాను అధ్యక్షుడిగా పని చేయడంపై దృష్టి పెడతానని చెప్పారు. కాగా బిడెన్ లేకుండానే అమెరికా ఎన్నికల ప్రచారం జరుగుతోంది. డెమొక్రాటిక్ పార్టీ నామినీగా కమలా హ్యారీస్‌కు పార్టీ ప్రతినిధుల మద్ధతు లభిస్తుండడంతో ఆమె ప్రచారంలో దూసుకెళ్తున్నారు.

# కనిపెంచిన తల్లిదండ్రులను సంరక్షిద్దాం

### సీనియర్ సిటీజేన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్



జగిత్యాల జూలై 25 (ప్రజామంటలు): కనిపెంచిన తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో తగు సంరక్షణ సదుపాయాలు కల్పించి ఆసరాగా పిల్లలు ఉండాలని తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో జగిత్యాల డివిజన్ లోని గ్రామాల సీనియర్ సిటిజెన్ల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు.16 మంది వృద్ధుల పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. గ్రామాల ప్రతినిధులకు సీనియర్ సిటీజేన్స్ పిలుపు పుస్తకాలు అందజేశారు.ఈ సందర్భంగా హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ.... కూతుర్లు, కొడుకులు ప్రయోజకులుగా ఎదగడానికి అష్టకష్టాలు పడిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిరాదరించడం, ఆస్తులకోసం వారిపై దాడులు చేయడం అమానుషమన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేసిన వారిపై సంబంధించిన రెవెన్యూ డివిజన్ అధికారులకు ఫిర్యాదు చేస్తే వారి పిల్లల పై చట్టప్రకారం 6 మాసాల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే చర్యలుంటాయన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు,ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, పి.సి. హన్మంత్ రెడ్డి, ఎం.డి. యాకూబ్, జగిత్యాల అధ్యక్షుడు బి. రాజేశ్వర్, దిండిగాల విఠ్ఠల్, కే. సత్యనారాయణ, సింగం గంగాధర్, కండ్లే గంగాధర్, దుబ్బేశం, పుప్పాల నర్సింగారావు, హన్మాండ్లు, కిషన్, సూర్య నారాయణ, దేవేందర్ రావు, కస్తూరి శ్రీమంజరి, గంగం జలజ, సింగం పద్మ, బక్కశెట్టి లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

## మెదడు వాపు నివారణ టీకా వేసుకోవాలి

మెడికల్ ఆఫీసర్ డా. ఎలిజబెత్ రాణి

బౌద్ధనగర్ లో స్పెషల్ డ్రైవ్



సికింద్రాబాద్ జూలై 25 (ప్రజామంటలు): తొమ్మిది నెలల నుంచి 15 ఏండ్ల లోపు చిన్నారుల్లో మెదడు వాపు వ్యాధి నివారణకై జేఈ (జపనీస్ ఎన్సెఫలిటీస్) టీకాలను వేసుకోవాలని రెడ్రాక్స్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎలిజబెత్ రాణి కోరారు. గురువారం బౌద్ధనగర్ డివిజన్ అంబర్ నగర్, అశోక్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 59 మంది చిన్నారి విద్యార్థులకు జేఈ వ్యాక్సిన్ వేశారు. తొమ్మిది నెలల నుంచి 15 ఏండ్ల లోపు పిల్లలకు ఈనెల 25 నుంచి వచ్చే నెల 15 వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి జేఈ వ్యాక్సిన్ వేస్తామన్నారు. రెండేళ్ళ లోపు చిన్నారులకు రెండు డోసులు, రెండేళ్ళపైబడిన వారికి ఒక డోసు వ్యాక్సిన్ తీసుకోవాలని డాక్టర్ ఎలిజబెత్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, మదర్సాలు, అంగన్ వాడీ సెంటర్లులల్లో వందశాతం వ్యాక్సినేషన్ చేపడతామన్నారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు తమ పరిధిలో లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. తల్లిదండ్రులు వ్యాక్సిన్ ను తమ పిల్లలకు వేయించాలని కార్పొరేటర్ కంది శైలజ కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, స్టూడెంట్స్ పేరేంట్స్, సిబ్బంది పాల్గొన్నారు.



## లారీని ఢీకొన్న బైక్..

## ముగ్గురు యువకుల దుర్మరణం

సంగారెడ్డి, జూలై25 (ప్రజా మంటలు): సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. కంది మండలం తునికిళ్ల తండా శివారులో జరిగిన ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీని వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే చనిపోయారు. మృతులను పుల్కల్ మండలం గంగోజీపేటకు చెందిన సందీప్, నవీన్, అభిషేక్‌గా గుర్తించారు. ఈ ముగ్గురూ అక్షయపాత్రలో డెలివరీ బాయ్స్‌గా పనిచేసేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని గుర్తించారు. పోలీసులు వెంటనే చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తల్లీ కుమారుడు ఆత్మహత్య

హైదరాబాద్ జూలై25 (ప్రజా మంటలు): ఆర్థిక ఇబ్బందులతో తల్లీకుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. నగరంలోని చైతన్యపురి పీఎస్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. కొత్తపేటలోని ఎస్ఆర్ కాలనీలో తల్లి గంజి పద్మ (40), కుమారుడు వంశీ (18) అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. పద్మ భర్త శివ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఆమె కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో బుధవారం రాత్రి పద్మ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తల్లి మృతిని తట్టుకోలేక కుమారుడు వంశీ కూడా ఉరివేసుకుని చనిపోయాడు. సమాచారం అందుకున్న చైతన్యపురి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఏపీలోని ఒంగోలుకు చెందిన వీరి కుటుంబం కొన్నేళ్లుగా ఎస్ఆర్ కాలనీలో ఉంటోంది.




## కేంద్ర బడ్జెట్ లో దేశవ్యాప్తంగా మరోసారి బిసి లకు అన్యాయం

### బిసి ల అభ్యున్నతికి నామమాత్రంగా నిధులు



జగిత్యాల జూలై 25 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన బిసి సంక్షేమ సంఘం సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మినారాయణ మాట్లాడుతూ.... కేంద్ర బడ్జెట్?లో దేశవ్యాప్తంగా ఉన్న 85 కోట్ల మంది బీసీల అభ్యున్నతికి కేవలం 3300 కోట్లు మాత్రమే ఇచ్చారని, తెలంగాణ రాష్ట్రానికి సైతం నిధులకు కేటాయింపుల్లో అన్యాయం జరిగిందని ఆరోపించారు. రాష్ట్రం నుంచి 8 మంది భాజపా ఎంపీలను గెలిపించిన కేంద్రం నిధులను ఇవ్వనందుకు నైతిక బాధ్యత వహించి ఎంపీలు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ సాగునీటి ప్రాజెక్టులతో పాటు వెనుకబడిన ఉత్తర తెలంగాణకు హైదరాబాదులోని ఫార్మసీ హబ్, ఐటీ కారిడార్ అభివృద్ధి, రాష్ట్రంలో నూతన విమానాశ్రయాల ఏర్పాటు, తదితర వాటికి నిధులు ఇవ్వకుండా అన్యాయం చేసిందని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్?లో తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశంలోని యావత్ బీసీ లకు మరోసారి అన్యాయం జరిగిందని విమర్శించారు. 48 లక్షల కోట్ల బడ్జెట్?లో 85 కోట్ల బీసీ లకు కేవలం 3300 కోట్లు కేటాయించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు ధర్మాన్ని, మతాన్ని మోయడానికి తప్ప అభివృద్ధి చెందకూడదనే ఉద్దేశంతోనే బడ్జెట్ కేటాయించలేదని విమర్శించారు. సింగరేణి, విద్యుత్ ప్రాజెక్టులు, ఆదిలాబాద్, నిజామాబాద్ ఎయిర్?పోర్టులు, తదితర అంశాలను పూర్తిగా విస్మరించడానికి గల వాటికి తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, సంయుక్త రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ అలిశెట్టి ఈశ్వరయ్య, బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బి.సి. యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, బి.సి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మారిశెట్టి సూర్యప్రకాష్, బి.సి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు బండపెల్లి మల్లీశ్వరి, బిసి సంక్షేమ సంఘం పట్టణాధ్యక్షుడు రాపర్తి రవి, యూత్ కో-ఆర్డినేటర్ హృషికేష్, ముద్దం గంగారెడ్డి, బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ ను నిరసిస్తూ మోడీ దిష్టి బొమ్మ దగ్ధం చేసిన కాంగ్రెస్ శ్రేణులు

జనగామ జూలై 25 (ప్రజామంటలు): డీసీసీ జనగామ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశానుసారం కేంద్ర బడ్జెట్ ని నిరసిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిష్టి బొమ్మను జనగామ కాంగ్రెస్ శ్రేణులు దగ్ధం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ..- కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ అనే పదాన్ని పలకడానికే కేంద్ర%శీ% ఇష్టపడటం లేదు పునర్విభజన చట్టం ప్రస్తావిస్తూ ఆంధ్రకి నిధులు కేటాయించింది కానీ తెలంగాణకు ఏ విషయంలోను నిధులు ఎందుకు కేటాయించలేదు అని అన్నారు. వారి మనసులో ఇంత కక్ష ఉందని తెలంగాణ ప్రజలు అనుకోలేదు.తెలంగాణపై మోడీ కక్షపూరిత వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధి కొరకు పాటుపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెట్టిన బడ్జెట్ ని ప్రశం చించాల్సి పోయి విమర్శించడం సిగ్గు చేటు, వారి దిగజారుడి తనమన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నాయకత్వంలో రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని అభినందిం చాలి, అలాగే చెప్పినట్టు అమలు చేస్తున్న హామీలు చూసి కూడా విమర్శించడం సరి కాదు, బీజేపీ వారు భేషరత్తుగా క్షమాపణ చెప్పాలి, లేకుంటే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి. జనగామ నియోజకవర్గంలోనీ అన్ని మండల కేంద్రాల్లో బీజేపీ వైఖరిని నిరసిస్తూ మోడీ దిష్టి బొమ్మ దగ్ధం చేయాలి అని పిలుపునిస్తున్న అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి మెంబర్ చెంచారపు శ్రీనివాస్ రెడ్డి డాక్టర్ రాజమౌళి జనగామ పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి మండలాధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి బచన్నపెట మండల అధ్యక్షులు నూకల బాల్ రెడ్డి, గంగాం నరసింహారెడ్డి రామచంద్ర%శీ%,బోట్ల నర్సింగరావు, వంగాల మల్లారెడ్డి,జక్కుల వేణు, జాఫర్ షరీఫ్, బదికే కృష్ణస్వామి గొలుసుల దుర్గేష్, మచ్చ ప్రవీణ్, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రయోజనాలకోసం ఉమ్మడి పోరాటం

### రాజకీయాలకు అతీతంగా కలసి నడవాల్సిందే

### తెలంగాణ అభివృద్ధి ఎజెండగా ముందుకు సాగాలి

హైదరాబాద్ జూలై25 (ప్రజా మంటలు): తెలంగాణ ప్రజా ప్రయోజనాల కోసం అంతా కలసికట్టుగా పోరాడుదా మని అసెంబ్లీలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు జ్ఞానోదయం కావాలి. తమిళనాడు లాగా ప్రయోజనాల విషయంలో కలసికట్టుగా పోరాడాలి. రాజకీయ విబేదాలను పక్కన పెట్టి పోరాడాలి. ఇప్పటికైనా తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాలి. రాజకీయాల కతీతంగా, జీ హుజూర్ రాజకీయాలు పక్కన పెట్టి, రాష్ట్ర అవసరాల కోసం స్వార్థంతో పట్టుదలగా కృషి చేయాలి. అప్పుడే రాష్ట్రానికి న్యాయం జరుగుతుంది. నిధుల కేటాయింపులు జరుగుతాయి. ఈ బడ్జెట్ తెలంగాణను విస్మరించిందన్న విసయాన్ని ముందుగా అన్ని పార్టీలో రాజకీయాలకు అతీతంగా అంగీకరించాల్సిందే. తెలంగాణకు సంబంధించి ప్రత్యేక కేటాయింపుల విషయంలో పూర్తిగా నిరాశ కల్పించింద నడంలోసందేహం లేదు. ఏపీకి అదనంగా నిధులు ఇచ్చినందుకు అభ్యంతరం లేదు. ఎపిని ఆదుకోవాల్సిందే. అదే సందర్భంలో తెలంగాణను కూడా ఆదుకోవాల్సిందే. విలీన మండలాలపైనా ఎలాంటి ప్రతిపాదనా ప్రకటించలేదు. బడ్జెట్ సందర్భంగా ఏపీకి చెందిన కేందరమంత్రి రామ్మోహన్ నాయుడు, ఇతర ఎంపీలు వాళ్ళ రాష్ట్రానికి వచ్చిన కేటాయింపులు చంద్రబాబునాయుడు సమర్థతో తెచ్చారని చెప్పుకుంటున్నారు. తెలంగాణ ప్రజలు కూడా ఈ రాష్ట్రానికి సంబంధించి కేంద్రమంత్రులు, అధికార పార్టీ ఎంపీలు మాట్లాడాలని కోరుకోగలగాలి. మేమంతా సమర్థంగా సమిష్టిగా పోరాడి నిధులు తెచ్చుకోగలిగామని చెప్పుకోవాలి. బండి సంజయ్ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. కేటాయింపుల్లో అన్యాయం గురించి ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ తరహాలో బిజెపి కూడా తమ విధానం ప్రకటించాలి. తెలంగాణ వారిగా మనమంతా ప్రశ్నించాల్సిందే. పెదవి విప్పక పోతే నష్టం జరుగుతూనే ఉంటుంది. రాష్ట్ర ప్రయోజనాలను, ప్రత్యేకించి రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినందున హామీలపై పోరాడాల్సిందే. కేంద్రమంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉండి కూడా, ఈసారి తెలంగాణ నుంచి బీజేపీకి ఎన్నడూ లేనంత ఆదరణ దొరికినా కూడా కేంద్రమంత్రులు, ఎంపిలు మాట్లాడకపోవడం తెలంగాణ ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. ఎనిమిదిమంది ఎంపీలను గెలిపించిన ప్రజలు గర్వపడేలా ఎంపీలు ప్రత్యేకంగా తమ రాష్ట్రానికి ఏమైనా సాధించారో చెప్పడలగాలి. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన పన్నుల్లో వాటా రావడం వేరు. కేంద్ర ప్రాయోజిత పథకాలు ఎవరున్నా లేకున్నా వస్తాయి. కానీ కేటాయింపుల్లో మాత్రం పోరాడాల్సిందే. కేంద్ర వ్యవహారశైలి, తెలంగాణ పట్ల వారి వైఖరి ఈ ఒక్క బడ్జెట్‌తో స్పష్టం అయ్యింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో సఖ్యత నెరపలేదని అంటున్న వారు.. ఇప్పుడు రేవంత్ రెడ్డి సఖ్యతగా ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో కిషన్ రెడ్డి లాంటి వారు చెప్పాలి. సిఎం, మంత్రులు కలసికట్టుగా పలువరు వినతిపత్రాలు సమర్పించినా లాభం లేకుండా పోయింది. అందుకే ఇప్పుడు కేంద్రంపై పోరాటంలో రాజకీయాలు అతీతంగా కలిసి రావాలని సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు సరైనదిగానే భావించాలి. రేవంత్‌రెడ్డి ఇప్పుడు దక్షిణాది ప్రస్తావన తెచ్చి, మిగతా రాష్ట్రాలకు జరుగుతున్న విసయాన్ని దేశం దృష్టికి తెచ్చారు. ఇవన్నీ ఇలావుంటే ఘనంగా చెప్పుకుంటున్న బడ్జెట్ ద్వారా ద్రవ్యోల్బణం గురించి చర్చించలేదు. వికసిత భారత్‌లో ప్రతిరోజూ ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించే ప్రయత్నాలపై మాట్లాడలేదు.

## రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమానికి 9200 కోట్లు కేటాయింపు

### హర్షం వ్యక్తం చేసిన మొత్కూరి శ్రీనివాస్ గౌడ్



ఇల్లందకుంట జూలై 25 (ప్రజామంటలు): బీసీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం 9200 కోట్లు కేటాయించి నందుకు స్థానిక ఇల్లందకుంట మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మొత్కూరి శ్రీనివాస్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బీసీల అభివృద్ధి కోరకు ఈ బడ్జెట్ ఉపయోగ పడుతుందన్నారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ ఈ బడ్జెట్ ను రూపొందించి నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి గారికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మరియు రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ గౌడ్ గారికి ఇల్లందకుంట మండల బీసీ సంక్షేమ సంఘం నాయకులు కారింగుల రాజేందర్, తోడేటి మధు, గైకోటి రాజు, గడ్డి గోవర్ధన్, జంపాల రితేష్, చింతల కౌశిక్, గంథం రవీందర్, తోట రాజు, గుండారపు సాయి, దరుగుల వంశీ, అరెల్లి శ్రీకాంత్, ముడెడ్ల రమేష్, నర్మేట హారిక్రిష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతాం

**మరింత ప్రణాళికాబద్ధంగా అభివృద్ధికి కృషి**

**పలు మార్గాల్లో మెట్రో విస్తరణకు నిధులు**

**మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధితో మార్పు**



హైదరాబాద్, (ప్రజా మంటలు):
విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న చారిత్రాత్మక నగరం హైదరాబాద్‌ను మరింత ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్ ను గురువారం ఆయన అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి భారీగా రూ.10వేల కోట్లు కేటాయించారు. శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూ.1500 కోట్లు, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు రూ.1,525 కోట్లు, పాతబస్తీ మెట్రో విస్తరణకు రూ.500 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు, మెట్రో వాటర్ వర్క్స్ రూ.3,385 కోట్లు, హైడ్రా సంస్థకు రూ.200 కోట్లు కేటాయించారు. హైదరాబాద్‌లో ఉద్యోగ, ఉపాధి పొందుతున్నవారికి కార్యాలయాలకు దగ్గరగా, శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణాన్ని నగరం చుట్టూ ప్రోత్సహిస్తాం. ఈ టౌన్‌షిప్ లలో సరసమైన ధరల్లో పేద, మధ్యతరగతి వారికి అనుకూలమైన నివాసగృహాల నిర్మాణాలను అందించేలా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం మూడు ట్రాఫిక్ కారిడార్లలో మెట్రో సౌకర్యం ఉంది. వివిధ వర్గాల అవసరాలను తీర్చడంతో పాటు నగరంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో, ప్రభుత్వం 78.4 కి.మీ. పొడవున్న 5 అదనపు కారిడార్లను రూ.24,042 కోట్లతో అభివృద్ధి పరుస్తుంది. ఇందులోభాగంగా మెట్రో రైలును పాతనగరానికి పొడిగించి దానిని శంషాబాద్ విమానాశ్రయానికి అనుసంధానం చేస్తామన్నారు. ప్రస్తుతమున్న కారిడార్లను నాగోలు నుంచి ఎల్.బి.నగర్ వరకు విస్తరిస్తాం. నాగోలు, ఎల్.బి నగర్, చంద్రాయణగుట్ట స్టేషన్లను ఇంటర్ ఛేంజ్ స్టేషన్లగా అభివృద్ధి చేస్తాం. మియాపూర్ నుంచి పటాన్ చెరువుకు, ఎల్.బి.నగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రో రైలు సౌకర్యాన్ని పొడిగించాలని కూడా ప్రణాళిక సిద్ధం చేశాం. హైదరాబాద్, ఔటర్ రింగ్ రోడ్డు వరకు గల ప్రాంతాలను కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించి వాటి అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తాం. ఔటర్ రింగు రోడ్డును నగర సరిహద్దుగా పరిగణిస్తాం. ఓఆర్ఆర్ పరిధిలో విపత్తుల నిర్వహణకు ఒక ఏకీకృత సంస్థ ఏర్పాటు. జీహెచ్ఎంసీ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయి. పట్టణ విపత్తులను నివారించడానికి, వాటిని ఎదుర్కొనడానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంతో పాటు, ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని తక్షణ రక్షణ చర్యలు తీసుకొనే విషయంలో జాతీయ, రాష్ట్రేతర సంస్థలతో సమన్వయం. ఈ వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యత హైదరాబాద్ విపత్తు నివారణ, ఆస్తుల పరిరక్షణ సంస్థ చేస్తుంది. ఈ సంస్థలో ఆస్తుల పరిరక్షణకు, విపత్తుల నిర్వహణకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశామన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 110 చదరపు కి.మీ. పట్టణ ప్రాంతం పునరుజ్జీవనం. నదీ తీర ప్రాంతంలో కొత్త వాణిజ్య, నివాస కేంద్రాలు, పాత హెరిటేజ్ ప్రాంతాలకు కొత్త సొబగులు అద్దుతామని అన్నారు. మూసీ నదీ పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టులో రిక్రియేషన్ జోన్‌లు, పాదచారుల జోన్‌లు, పీపుల్స్ ప్లాజాలు, చిల్డ్రన్స్ థీమ్ పార్కులు, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌ల అభివృద్ధి. లండన్ నగరంలో ఉన్న థేమ్స్ నదీ పరివాహక అభివృద్ధి తరహాలో మూసీ అభివృద్ధి. హైదరాబాద్ నగరాభివృద్ధి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూ.1,500 కోట్లు ప్రతిపాదన చేశారు. హైదరాబాద్ నగర ప్రాధాన్యం దృష్ట్యా నగరాభివృద్ధికి మరింత పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించారు. సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించేందుకు హెచ్ఎండిఏ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ.3,065 కోట్లు కేటాయించారు. మౌలిక వసతుల కల్పనకు రూ.500 కోట్లు. మెట్రో వాటర్ వర్క్స్‌కి రూ.3,385 కోట్లు ప్రతిపాదన. హైడ్రాకి రూ.200 కోట్లు, ఎయిర్‌పోర్టు వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డు కోసం రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకి రూ.500 కోట్లు, పాత నగరానికి మెట్రో విస్తరణకి రూ.500 కోట్లు, మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ కోసం రూ.50 కోట్లు కేటాయించారు. రీజనల్ రింగ్ రోడ్‌తో అభివృద్ధి మరింత వేగవంతం. ఉత్తర ప్రాంతంలోని 158.6 కి.మీ. పొడవున్న సంగారెడ్డి- తూప్రాన్ - గజ్వేల్ - చౌటుప్పల్ రోడ్డును, దక్షిణ ప్రాంతంలోని 189 కి.మీ.ల పొడవున్న చౌటుప్పల్ -షాద్ నగర్-సంగారెడ్డి రోడ్డును, జాతీయరహదారులుగా ప్రకటించడానికి వీలుగా అప్ గ్రేడ్ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదన. రీజనల్ రింగు రోడ్డు హైదరాబాద్ నగర ఉత్తర-దక్షిణ ప్రాంతాలనూ, తూర్పు-పశ్చిమ ప్రాంతాలనూ కలుపుతూ జాతీయరహదారి నెట్‌వర్క్‌తో అనుసంధానం చేస్తామని అన్నారు. ఎక్స్‌ప్రెస్‌వే ప్రమాణాలను దృష్టిలోఉంచుకొని దీని నిర్మాణానికి తగినంత భూమిని సేకరించే ప్రయత్నం. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా తొలుత నాలుగు లేన్లతో నిర్మించి దానిని ఎనిమిది లేన్ల సామర్థ్యానికి విస్తరణ. ప్రాథమిక అంచనాల ప్రకారం ఆర్.ఆర్.ఆర్ ఉత్తర ప్రాంత అభివృద్ధికి రూ.13,522 కోట్లు. దక్షిణ ప్రాంతాభివృద్ధికి రూ.12,980 కోట్లు ఖర్చు. దీనికోసం బడ్జెట్‌లో ప్రస్తుతం రూ.1525 కోట్ల ప్రతిపాదన చేశారు.

# హైదరాబాద్‌లో పడకేసిన పారిశుధ్యం

**ఎక్కడ చూసినా చెత్తకుప్పల దర్శనం: కెటిఆర్**



హైదరాబాద్, (ప్రజా మంటలు):
హైదరాబాద్‌లో ఎక్కడా చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సుమారు 1000 స్వచ్ఛ ఆటోలు పనిచేయడం లేదన్నారు. బస్తీలు, కాలనీల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని చెప్పారు. డెంగీ, మలేరియా, అతిసారం వంటి సీజనల్ వ్యాధులతో ప్రజలు అవస్థలుపడుతున్నారని వెల్లడించారు. చెత్త తరలింపు కేవలం కాగితాల్లో మాత్రమే కనిపిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేయర్, అధికారుల ఆకస్మిక పర్యటనలు లేకపోవడంతో పారిశుధ్య నిర్వహణ గాడితప్పుతున్నదని చెప్పారు. పర్యవేక్షించాల్సిన పార్ట్-టైం మున్సిపల్ మంత్రేమో ఎమ్మెల్యేల కొనుగోళ్లు, ఢిల్లీ చక్కర్లలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇకనైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, పౌరుల ఆరోగ్యాలు కాపాడాలని ప్రభుత్వానికి సూచించారు.

# గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం

**డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు**

**హోంశాఖకు బడ్జెట్ లో రూ.9,564 కోట్లు కేటాయింపు**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
రాజధాని హైదరాబాద్ సహా తెలంగాణ వ్యాప్తంగా పేట్రేగిపోతున్న గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఇటీవల సినీ పరిశ్రమకు కూడా కీలక సూచనలు సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజా బడ్జెట్ లోనూ దీన్ని ప్రధానంగా ప్రస్తావించారు. యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాల కట్టడి, శాంతి భద్రతల కోసం హోం శాఖకు బడ్జెట్ లో రూ.9,564 కోట్లు కేటాయించింది. మాదక ద్రవ్యాల వినియోగం చాలా ప్రమాదకరం. యువత దీని బారినపడితే దేశ భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారుతుంది. రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా విద్యార్థులను ఈ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు వివిధ చర్యలు తీసుకుంటున్నాం. డ్రగ్స్ రవాణా, వినియోగం చేస్తూ పట్టుబడితే వారిని ఉపేక్షించొద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. తెలంగాణ మాదకద్రవ్య నిరోధక సంస్థకు తగిన సౌకర్యాలు కల్పించి దాన్ని బలోపేతం చేశాం. విద్యాసంస్థల్లో వీటి కట్టడికి యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి.. 4,137 మంది విద్యార్థులను యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా నియమించాం. మాదక ద్రవ్యాల వల్ల జరిగే హానిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సినీ ప్రముఖుల సహకారం తీసుకుంటున్నాం. వీటికి సంబంధించిన కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం. తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇస్తున్నాం అని ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. మరోవైపు నానాటికీ పెరుగుతున్న సైబర్ నేరాలపైనా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ విషయాన్ని కూడా మంత్రి భట్టి బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. రాష్ట్రాభివృద్ధికి శాంతి భద్రతల పరిరక్షణ ఎంతో అవసరం. అభద్రతా వాతావరణంలో పెట్టుబడి పెట్టడానికి అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపించవు. ఈ మధ్య వైట్ కాలర్, సైబర్ నేరాలు పోలీసు వ్యవస్థకు సవాల్‌గా మారుతున్నాయి. ఇలాంటి నేరాలను అరికట్టేందుకు సైబర్ సెక్యూరిటీ విభాగానికి అవసరమైన వాహనాలు అందించాం. ఆధునిక నేర పరిశోధనలో పోలీసులకు శిక్షణ ఇస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలో సైబర్ క్రైమ్ ఫిర్యాదులను నమోదు చేసే అవకాశం కల్పించాం. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదులు చేసేలా వెబ్‌సైట్, టోల్‌ఫ్రీ నంబరుపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. కేంద్రం తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించేలా శిక్షణా తరగతులు నిర్వహించాం అని మంత్రి భట్టి వివరించారు.



# కేజ్రీవాల్, కవిత కస్టడీ పొడిగింపు

- ఢిల్లీ కోర్టు నిర్ణయం

ప్రజా మంటలు ఢిల్లీ, జూలై 25: ఎక్సైజ్ స్కామ్ తాలూకు మనీ లాండరింగ్, అవినీతి కేసులో ఢిల్లీ కోర్టు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని గురువారం పొడిగించింది. ఈడీ దర్యాప్తు చేస్తున్న మనీలాండరింగ్ కేసులో జులై 31 వరకు, సిబిఐ దాఖలు చేసిన అవినీతి కేసులో ఆగస్టు 8 వరకు కేజ్రీవాల్ కస్టడీని ప్రత్యేక జడ్జీ కావేరి బవేజా పొడగించారు. మనీ లాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీపార్టీ నాయకుడు, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, బీఆర్ఎస్ నాయకురాలు కవిత , ఇతర నిందితుల జ్యుడీషియల్ కస్టడీని కూడా జులై 31 వరకు పొడగించారు. నిందితులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు ప్రవేశ పెట్టారు. సుప్రీం కోర్టు ఇదివరలో ఈడీ కేసులో కేజ్రీవాల్ కు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. అయినా, ఆయన ఇప్పటికీ తీహార్ జైలులో ఉన్నారు. కారణం ఆయన కేసులో బెయిల్ బాండ్ సమర్పించలేదు. ఆయన సీబీఐ కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

# 33 రకాల వరి పంటలకు బోనస్

**సన్నాలను పండించేలా ప్రోత్సాహకాలు**

**క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లింపు**

**వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు**

**హార్టికల్చర్‌కు రూ.737 కోట్లు**

**పశుసంవర్ధక రంగానికి రూ.1980 కోట్లు**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణలో వరిసాగు విస్తృతంగా జరుగుతున్నదని, కానీ పండిన పంటలకు సరైన గిట్టుబాటు ధరరాక, పెట్టిన పెట్టుబడి కూడా మిగలక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. 33 రకాల వరి పంటలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. 'తెలంగాణలో వరి సాగు చాలా విస్తృతంగా జరుగుతున్నది. పండిన పంటకు సరైన ధర రాక, పెట్టుబడి కూడా దక్కక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్రంలో సన్న రకం వరి ధాన్యాల సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం 33 రకాల వరి ధాన్యాలను గుర్తించి, వాటిని పండించిన రైతుకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని నిర్ణయించింది. దీనివల్ల సన్న రకం వరి సాగు విస్తీర్ణం పెరిగి, రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది. బడ్జెట్లో వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు ప్రతిపాదించారు. అదేవిధంగా హార్టికల్చర్‌కు రూ.737 కోట్లు, పశుసంవర్ధక రంగానికి రూ.1980 కోట్లు ప్రతిపాదించారు. రాష్ట్రంలో 12.12 లక్షల ఎకరాలలో ఉద్యాన పంటల సాగు ద్వారా 53.06 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతున్నదని చెప్పారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ఎన్ఎంఈఓ ఓపీ పథకం కింద ఆయిల్ పామ్‌సాగు రైతులకు అవసరమైన సహాయం అందిస్తామన్నారు. 2024-25లో రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్‌గు చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ఇప్పటికే 77,857 ఎకరాలకి రిజిస్ట్రేషన్ జరుగగా, 23,131 ఎకరాలకి అనుమతులు కూడా ఇచ్చామన్నారు. వచ్చిన మొత్తం రిజిస్ట్రేషన్లకి ఈ నెలలోనే ప్లాంటేషన్ మరియు డ్రిప్ అనుమతులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. పాడిపశువుల పెంపకం గ్రామీణ ప్రజానీకానికి ఎంతో ఆర్థిక పుష్టిని ఇస్తుంది. పాలు, మాంసం, గుడ్లు ప్రజానీకానికి పోషణ అందించడంతో పాటు, అదనపు ఆదాయం ఇస్తాయి. ఇతర అనుబంధ రంగాలైన చేపలు, గొర్రెలు, కోళ్ల పెంపకం ఎంతో మందికి జీవనోపాధికల్పిస్తాయి. ఈ రంగం గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి కల్పిస్తూ, అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తుంది. పాల ఉత్పత్తి రంగంలో 62 శాతం వాటా చిన్న, సన్నకారు,భూమిలేని పేదలదే. వారు రాష్ట్రంలోని పశు సంపదలో 70 శాతం వాటా పొంది ఉన్నారు. ఈ రంగంలో రాష్ట్రం 326.39 లక్షల పశుసంపదతో దేశంలో ఎనిమిదో స్థానంలో ఉంది.శుసంవర్ధక రంగానికి ఈ బడ్జెట్లో రూ.1,980 కోట్లు ప్రతిపాదిస్తున్నాం' అని చెప్పారు.

# తలసరి ఆదాయంలో మనమే మిన్న

**జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు ఎక్కువ**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణ రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన బడ్జెట్ ప్రసంగం చేస్తూ.. తలసరి ఆదాయంలో జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు చాలా ఎక్కువగా ఉందని చెప్పారు. 'ప్రస్తుతం తలసరి ఆదాయంలో జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు ఎక్కువ. రాష్ట్రంలో తలసరి ఆదాయ సగటు రూ.3,47,299 ఉంటే.. జాతీయ తలసరి ఆదాయ సగటు కేవలం రూ.1,83,236గా ఉంది. అంటే జాతీయ తలసరి ఆదాయ సగటుతో పోల్చితే.. రాష్ట్ర తలసరి ఆదాయ సగటు రూ.1,64,063 ఎక్కువగా ఉన్నది' అని భట్టి విక్రమార్క చెప్పారు. అయితే తలసరి ఆదాయ స్థాయిల్లో జిల్లాల మధ్య తీవ్ర అంతరం ఉన్నదని, రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం రూ.9,46,862 ఉంటే.. వికారాబాద్‌లో రూ.1,80,241 ఉన్నదని ఆర్థిక మంత్రి చెప్పారు. జిల్లాల మధ్య ఉన్న ఆదాయ అంతరాలను తగ్గించడానికి తాము కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

# బీర్పూర్ తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనఖి చేసిన కలెక్టర్



బీర్పూర్ జూలై 25 (ప్రజామంటలు):
బీర్పూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్. ఈ సందర్భంగా మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సంబంధించిన, రికార్డ్స్ సరిగ్గా నమోదు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం ధరణి సమస్యలు, ఎమ్మార్వో ఆఫీస్ వచ్చే అన్ని ఫిర్యాదులను స్వతరమే పరిష్కరించాలని అన్నారు. అధికారులకు అందరు సమయపాలన పాటించాలని సూచించారు. ఆఫీస్ పరిసరాలు పరిశీలించి శుభ్రంగా ఉంచాలని ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని చెప్పారు .

# పారిశుద్ధ్య పనుల ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ సత్య ప్రసాద్,

**మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్**



జగిత్యాల జులై 25 (ప్రజామంటలు):
జగిత్యాల పట్టణం అభివృద్ధి పారిశుధ్యం పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. జగిత్యాల కేంద్రంలో చేపడుతోన్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆకస్మిక తనిఖీ చేశారు. పురపాలక పరిధిలో నిర్మించనున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పట్టణ ప్రగతి నేపథ్యంలో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో ముందుండాలని పేర్కొన్నారు. జగిత్యాల పట్టణ అభివృద్ధికి సమస్టిగా అధికారులు కృషి కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్యం మెరుగు పరిచే దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. పట్టణ పారిశుద్ధ్య, అభివృద్ధి, గ్రీనరీ పనులపై కలెక్టర్ తో మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TEL-TEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com